LGTV

RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ఎడిటర్: చిలకమర్రి రెంరెడ్డి

ద్విభాషా దినపత్రిక

www.localguidenews.com

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,290 | పేజీలు -12 | శనివారం - 14 - నవంబర్ - 2026 | వెల రూ.2/-



కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపుపై విచారణ జరపాలి: కవిత డిమాండ్


- ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? లేదా? అనే అంశంపై బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలన్న కవిత
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్యి
- సిద్ధిపేటలో బీఆర్ఎస్ కార్యాలయానికి భూమిపూజ చేసిన కవిత దంపతులు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈరోజు సిద్దిపేట జిల్లా పర్యటనకు వచ్చిన కవిత, తన భర్తతో కలిసి మిగతా 2 లో

వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తాం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచాం

- ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలి
- ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలి



- అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశాం



హైదరాబాద్: వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి మంత్రి దామోదర రాజనర్సింహ గారితో కలిసి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను మిగతా 2 లో

అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పబట్టిన పొన్నం ప్రభాకర్

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శ



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా మిగతా 2 లో

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే చూస్తూ ఊరుకోం: హరీశ్ రావు హెచ్చరిక

- కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ధర్నా
- 3.15 ఎకరాల స్థలం వేలాన్ని నిరసిస్తూ స్థానికులతో కలిసి ఆందోళన



- ధర్నాలో పాల్గొన్న హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



టీటీడీకి రూ.10 కోట్ల విరాళం

ఇచ్చిన హైదరాబాద్ భక్తుడు

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 కోట్ల విరాళం

టీటీడీకి విరాళం అందించిన హైదరాబాద్ భక్తుడు కొడాలి శ్రీకాంత్

రంగనాయకుల మండపంలో అదనపు ఈవోకు చెక్కు అందజేత

భారీ విరాళం అందించిన దాతను అభినందించిన టీటీడీ



రాష్ట్రంలో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సీఎం చంద్రబాబుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో క్లియర్ చేస్తామన్న హామీలు

అమరావతిలో రూ.174 కోట్ల పెట్టుబడితో ఒబెరాయ్ హోటల్

ఏపీ రాజధానిలో ఒబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్.. సీఐఐ సదస్సులో కీలక ఒప్పందం

150 ప్రత్యక్ష, 250 పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

త్వరలో వెల్లడికానున్న హోటల్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర వివరాలు

అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆతిథ్య రంగాన్ని విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రముఖ హోటల్ రంగ సంస్థ ఒబెరాయ్ గ్రూప్ అమరావతిలో ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) అధికారికంగా కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సీఆర్‌డీఏ అధికారులు, ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులు ఈ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ ద్వారా రాజధాని నగరానికి దాదాపు రూ.174 కోట్ల మేర పెట్టుబడులు రానున్నాయి. ఈ లగ్జరీ హోటల్ ప్రాజెక్టు రాకతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. దాదాపు 150 మందికి ప్రత్యక్షంగా, మరో 250 మందికి పరోక్షంగా.. మొత్తంగా 400 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డిలతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే క్రమంలో ప్రముఖ బ్రాండ్లు రాజధానికి రావడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. హోటల్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

హైదరాబాద్‌లో 4 పీఆర్‌టీఎస్ కారిడార్లు..

ఏడాదిలోనే తొలిదశ పూర్తి

- హైదరాబాద్‌లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రతిపాదన
- ఏడాదిలోగా తొలి దశను పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఐటీ కారిడార్ సహా నాలుగు కీలక మార్గాల్లో నిర్మాణం
- మెట్రోకు అనుబంధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం
- ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గించడంలో కీలక పాత్ర అంచనా

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మిగతా 2 లో

అమెరికాలో రికార్డు స్థాయిలో బహిష్కరణలు.. ఏడాదిలోనే 4.8 లక్షల మందిని పంపేసిన వైనం

2026 ఆర్థిక సంవత్సరంలో అమెరికాలో రికార్డు స్థాయిలో వలసదారుల అరెస్టులు

సుమారు 4.83 లక్షల మందిని దేశం నుంచి బహిష్కరించిన 'ఐస్' ఏజెన్సీ

ఇది 'ఐస్' 23 ఏళ్ల చరిత్రలోనే అత్యధికమని హోంల్యాండ్ సెక్యూరిటీ వెల్లడి



ఇంటికో

రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం.. 15 మందికి అర్జున అవార్డుల అందజేత

రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల-2025 ప్రదానోత్సవం




ఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, కోచ్‌లకు ఇచ్చే జాతీయ క్రీడా పురస్కారాల-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. డెకాథ్లాన్ మిగతా 2 లో

ఐటీ శకం ముగిసింది.. ఇక ఏఐ, క్వాంటం యుగం

విశాఖలో రెండో రోజు కొనసాగుతున్న పెట్టుబడుల సదస్సు

వివిధ రంగాలకు సంబంధించి ముఖ్యమంత్రి సమక్షంలో 12 కీలక ఒప్పందాలు

పెట్టుబడులు లేకపోతే సంపద సృష్టి జరగదన్న చంద్రబాబు



అమరావతి: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు 12 అవగాహన మిగతా 2 లో

పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఏపీ లక్ష్యం: మంత్రి నారా లోకేశ్

- విశాఖలో ఆర్టీఐహెచ్ ఆధ్వర్యంలో ఘనంగా స్టార్టప్ ఎక్స్‌ఛేంజ్ సదస్సు
- మొదటి విడతగా 31 స్టార్టప్‌లకు రూ.2.11 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకం
- రాష్ట్రవ్యాప్తంగా 25 పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ల ఏర్పాటుకు కార్యాచరణ

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంగారెడ్డి ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

అమెరికాలో రికార్డు స్థాయిలో బహిష్కరణలు..
ఏడాదిలోనే 4.8 లక్షల మందిని పంపేసిన వైనం

ఢిల్లీ: అమెరికాలో వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరి మరోసారి స్పష్టమైంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 'ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఐసీఈ) ఏజెన్సీ చరిత్రలోనే అత్యధిక స్థాయిలో వలసదారులను దేశం నుంచి బహిష్కరించడంతో పాటు అరెస్టులు కూడా చేపట్టింది. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారికంగా గణాంకాలను విడుదల చేసింది. హోంల్యాండ్ సెక్యూరిటీ వివరాల ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 4,83,200 మందిని దేశం నుంచి బహిష్కరించారు. 'ఐస్' ఏజెన్సీ 23 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యధికం. గత ఏడాది నమోదైన 4,42,640 బహిష్కరణల రికార్డును ఇది అధిగమించింది. ఇదే సమయంలో అరెస్టుల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 4,91,000 దాటింది. వీటిలో సుమారు 4,75,000 అడ్మినిస్ట్రేటివ్ అరెస్టులు కావడం గమనార్హం. ముఖ్యంగా ఆగస్టు 2026లో 50,925 మందిని అరెస్ట్ చేయగా, సెప్టెంబర్ నెలలో 48,000కు పైగా అరెస్టులు నమోదయ్యాయి. ట్రంప్ ప్రభుత్వం వలస విధానాలపై తీసుకున్న కఠిన చర్యల కారణంగానే ఈ రికార్డు స్థాయి అరెస్టులు, బహిష్కరణలు సాధ్యమయ్యాయని హోంల్యాండ్ సెక్యూరిటీ మంత్రి మార్క్‌వేన్ ముల్లిన్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని మూడు పూర్తి ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన మొత్తం అరెస్టులు, బహిష్కరణల కంటే ఈ ఏడాది గణాంకాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన నొక్కిచెప్పారు. ఈ ప్రకటన వెలువడటానికి కొద్ది రోజుల ముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తమ ప్రభుత్వ వలస విధానాలు 'కొంత కఠినంగా ఉండవచ్చని' అంగీకరించారు. అయితే, చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన వారిని తొలగించే ప్రయత్నాలను ఆయన సమర్థించుకున్నారు. మరోవైపు, కాంగ్రెస్‌లో పట్టు పెంచుకుంటున్న డెమొక్రాట్లు ఈ పరిణామాలపై దృష్టి సారించారు. 'ఐస్' ఏజెన్సీ అనుసరిస్తున్న పద్ధతులు, కఠిన నిబంధనలపై సమీక్ష జరపాలని యోచిస్తున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. విడుదలైన డేటాలో దేశ సరిహద్దుల్లో పట్టుబడిన వారు, దేశ అంతర్గతంగా అరెస్ట్ అయిన వారి మధ్య స్పష్టమైన విభజన లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో వలసదారులపై ప్రభుత్వ చర్యల పూర్తి స్వరూపంపై కొంత అస్పష్టత నెలకొంది.

రాష్ట్రంలో ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు దాటాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఈ పథకం నిర్వీర్యమైపోయిందని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేదవాడి చదువుకు పండుగలా ఉండేదని గుర్తుచేశారు. నేడు చంద్రబాబు పాలనలో అదే పథకం వేల కోట్ల బకాయిలతో చదువంటేనే దండుగగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ పథకం బకాయిలు రూ.6,400 కోట్లు దాటిపోయాయని, అందులో గత మూడేళ్లలోనే రూ.6,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఆమె తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని షర్మిల దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని బకాయిలు క్లియర్ చేస్తామని, నేరుగా కాలేజీల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ఆమె నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు దక్కక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని భారీ ప్రచారాలు చేసుకుంటూ, మరోవైపు పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెంచుకుంటూ పోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను
ఎంత మొత్తమైనా విడుదల చేస్తాం

హైదరాబాద్: వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి మంత్రి దామోదర రాజనర్సింహ గారితో కలిసి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్సల కవరేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గారు గుర్తు చేశారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానంలో చేపట్టాలని ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా 3 టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని తెలిపారు. నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు ఎక్కువ సమయం పడుతున్నందున సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిమ్స్‌లో పడకలు లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్‌నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సూచించారు. టిమ్స్‌లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి గారు తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఏఐ పర్యవేక్షణతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్ల సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్‌పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూడేళ్లలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

చంద్రబాబు.. 23 లక్షల ఉద్యోగాల కల్పన ఎక్కడ?



తాడేపల్లి: ఆర్థిక మందగమనం ఉపాధి పరిస్థితులపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నిరుద్యోగం విషయంలో దేశంలోని రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో మరియు రెండవ త్రైమాసికంలో 3వ స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనం. ఈ గణాంకాలు ఆంధ్రప్రదేశ్‌లో దిగజారుతున్న పరిస్థితిని స్పష్టంగా సూచిస్తున్నప్పటికీ, 23 లక్షల ఉద్యోగాలు కల్పించామని గొప్పలు చెప్పుకుంటున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో మనం చూస్తున్నది మునుపెన్నడూ లేని విధంగా పెరిగిన అవినీతి, అరాచకత్వం తప్పితే అభివృద్ధి అనేది ఏరకంగానూ జరగలేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి స్పష్టం చేశారు. ఏపీలో వేగవంతమైన ఆర్థిక ప్రగతి జరుగుతోందనే తప్పుదోవ పట్టించే కథనాన్ని తెరపైకి తెచ్చిన చంద్రబాబు.. జరుగుతున్న అవినీతి, అరాచకత్వాన్ని కప్పిపుచ్చే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో గణాంకాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా చూపిస్తుంటే, చంద్రబాబు ఆర్థిక ప్రగతి అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి పేరుతో చెప్పేవన్నీ గొప్పలు తప్పితే.. అక్కడ వాస్తవ పరిస్థితిని లెక్కల ద్వారా చూపించి మరీ కౌంటరిచ్చారు వైఎస్ జగన్. ప్రధానంగా పడిపోతున్న విద్యుత్ డిమాండ్, స్తంభించిన పన్ను ఆదాయాలు, పెరుగుతున్న నిరుద్యోగం అనే అంశాలను వైఎస్ జగన్ ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌ల ద్వారా జరిగిన విద్యుత్ అమ్మకాలు 71,722 మిలియన్ యూనిట్లు (ఎంయూ) కాగా, విద్యుత్ సరఫరా 79,758 మిలియన్ యూనిట్లుగా ఉంది. కానీ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలలో ఇది వరుసగా 70,885 మిలియన్ యూనిట్లు మరియు 78,546 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. ఈ రెండేళ్ల కాలంలో విద్యుత్ డిమాండ్ తగ్గిందనే విషయాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తోంది.

అభివృద్ధి చెందుతున్న ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా కొత్త పరిశ్రమల రాక, ఉన్న పరిశ్రమల సామర్థ్య వినియోగం పెరగడం మరియు ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వల్ల గృహ వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్ ఆరోగ్యకరమైన వేగంతో వృద్ధి చెందుతుంది. కానీ, గత రెండేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ డిమాండ్ తగ్గడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని మందగమనాన్ని బహిర్గతం చేస్తోంది. ఆర్థిక మందగమనాన్ని ప్రతిబింబించే గణాంకాలు కేవలం విద్యుత్ డిమాండ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ. 85,922.36 కోట్లు కాగా, కాగ్ విడుదల చేసిన 2025-26 తాత్కాలిక గణాంకాల ప్రకారం రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ. 86,552.65 కోట్లుగా మాత్రమే ఉంది. అంటే రెండేళ్ల కాలంలో సగటు వార్షిక వృద్ధి రేటు కేవలం 0.15% మాత్రమే నమోదైంది. గత రెండేళ్లుగా రాష్ట్రంలో వినియోగం మరియు పెట్టుబడులు పడిపోయాయనేందుకు ఇది స్పష్టమైన నిదర్శనం.

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఏపీ లక్ష్యం: మంత్రి నారా లోకేశ్

అమరావతి: రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎక్స్ఛేంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని వినూత్న ఆవిష్కరణలు, స్టార్టప్‌ల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఉద్దేశించిన ఈ వేదికలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన 6 అంకుర సంస్థల నిర్వాహకులను మంత్రి లోకేశ్ ప్రత్యేక జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ పాలసీ-2024 కింద ఎంపికైన 31 స్టార్టప్‌లకు తొలి విడతగా రూ.2.11 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన అప్రూవల్ పత్రాలు, చెక్కులను మంత్రి స్వయంగా ఆయా సంస్థల వ్యవస్థాపకులకు అందజేశారు.

25 రంగాల్లో పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లు

కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమగ్ర పారిశ్రామిక వృద్ధి కోసం 25 వేర్వేరు రంగాల్లో ఎకోసిస్టమ్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సిమెంట్ వంటి సంప్రదాయ రంగాలతో పాటు అత్యాధునిక క్వాంటం టెక్నాలజీ వరకు వీటిని విస్తరిస్తున్నామని చెప్పారు. స్టీల్, పునరుత్పాదక ఇంధనం, సోలార్ సెల్స్, వేఫర్ తయారీ, ఎయిర్ కండిషనింగ్, ఆక్వా, మెడికల్ డివైజెస్, ఫార్మా, డేటా రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని వివరించారు. ఏ పరిశ్రమకైనా ముడి సరుకు సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, మొబైల్ ఫోన్ తయారీ ఉదాహరణను ప్రస్తావిస్తూ దాదాపు 100 కిలోమీటర్ల పరిధిలోనే విడిభాగాలు, అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్ వంటి పూర్తి సరఫరా వ్యవస్థ అందుబాటులో ఉండేలా క్లస్టర్లను తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలో లభించే బీచ్ శాండ్ ఆధారిత రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాలు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఈ రంగంలో అత్యాధునిక పరిశోధనల కోసం ప్రపంచ స్థాయి విద్యాసంస్థలతో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్ (రావీ=) రంగంలోనూ అంతర్జాతీయ స్థాయి ఇంజనీర్లను ఏపీ నుంచే తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు.

రతన్ టాటా విలువలే స్ఫూర్తి

దివంగత ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా ప్రతి భారతీయుడికి గర్వకారణమని, ఆయన చూపిన విలువలు, నిజాయతీతో కూడిన వ్యాపార దృక్పథమే తమకు నిరంతర స్ఫూర్తి అని మంత్రి పేర్కొన్నారు. అందుకే రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఈ నూతన ఆవిష్కరణల హబ్‌కు ఆయన పేరు పెట్టినట్లు చెప్పారు. స్పేస్ సెక్టార్‌లో స్కైరూట్ సంస్థకు నమ్మకంతో 300 ఎకరాలు కేటాయించామని, అలాగే సముద్ర ఆధారిత డ్రోన్లను తయారుచేస్తున్న సాగర్ డిఫెన్స్ త్వరలోనే ఐపీవోకు వెళ్లబోతోందని ఉదహరించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు సరికొత్త ఆలోచనలతో ముందుకు వస్తే భూ కేటాయింపులు, గ్లోబల్ ఎక్స్‌పోజర్, వెంచర్ క్యాపిటలిస్టులతో అనుసంధానం కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

అంతకుముందు సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌ను మంత్రి లోకేశ్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజనీరింగ్, అగ్రి-టెక్, మెడ్-టెక్, ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ స్టాళ్లను సందర్శించి ఉత్పత్తుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. క్వాంటం కంప్యూటింగ్ విడిభాగాలు, వాయిస్ కమాండ్ ఆధారిత ఏఐ డ్రోన్లు, స్టేషన్ హైడ్రాలిక్ పవర్ ప్యాక్, ఎడ్యుకేషనల్ రోబోట్స్ వంటి పరికరాలను ఆసక్తిగా వీక్షించారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో ముచ్చటిస్తూ.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ఎం.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపుపై
విచారణ జరపాలి: కవిత డిమాండ్

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఈరోజు సిద్దిపేట జిల్లా పర్యటనకు వచ్చిన కవిత, తన భర్తతో కలిసి పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా కెనాల్ ఉందా లేదా అనే విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్పష్టం చేయాలని కవిత ప్రశ్నించారు. మౌనంగా ఉన్నంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావని ఆమె పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు. ప్రజల తరఫున తప్పులను ఎత్తిచూపుతూ ప్రశ్నిస్తుంటే, తనపై ఎదురుదాడి చేయడం సరైంది కాదన్నారు. తన వ్యక్తిగత ఆస్తులకు సంబంధించి వస్తున్న విమర్శలపై స్పందిస్తూ కవిత తీవ్రస్థాయిలో సవాల్ విసిరారు. "నేను.. నా అఫిడవిట్‌లో చూపినదానికంటే ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా.. ప్రజలకు రాసిస్తా" అని ఆమె స్పష్టం చేశారు.

బిల్ గేట్స్‌ను అలా ఒప్పించా.. సీఐఐ సదస్సులో
ఆసక్తికర విషయాలు చెప్పిన చంద్రబాబు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సీఐఐ భాగస్వామ్య సదస్సులో తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. సదస్సు రెండో రోజున సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మ నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను చేపట్టిన సంస్కరణలు, ముఖ్యంగా ఐటీ రంగంలో తన దార్శనికత గురించి చంద్రబాబు వివరించారు. భవిష్యత్తు ఐటీ రంగానిదేనని తాను ఆనాడే ఊహించి, దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు తెలిపారు. ఈ క్రమంలో మైక్రోసాఫ్ట్ బిల్ గేట్స్‌ను కలిసి, హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేలా ఒప్పించిన విధానాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. భారతదేశంలో గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో నైపుణ్యం ఉన్న మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఇది ఐటీ రంగ విస్తరణకు ఎంతగానో దోహదపడుతుందని తాను బిల్ గేట్స్‌కు వివరించినట్లు చెప్పారు. ఐటీ పరిశ్రమకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతులు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. అయితే, తాను ఐటీకి ప్రాధాన్యత ఇస్తుంటే, నాటి ప్రతిపక్షాలు తనను తీవ్రంగా విమర్శించేవని అన్నారు. కేవలం ఐటీ రంగమే కాకుండా దేశంలోనే మొట్టమొదటిసారిగా విద్యుత్ సంస్కరణలు కూడా తానే తీసుకొచ్చానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ క్రీడా పురస్కారాల
ప్రదానం.. 15 మందికి అర్జున అవార్డుల అందజేత

ఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, కోచ్‌లకు ఇచ్చే జాతీయ క్రీడా పురస్కారాల-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మహిళల ప్రపంచ కప్ విజేత దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు మొత్తం 15 మంది క్రీడారత్నాలు అర్జున అవార్డును అందుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్‌లో డెకాథ్లాన్‌లో కాంస్య పతకం సాధించి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించాడు. అదేవిధంగా ఫిడే మహిళల ప్రపంచ కప్-2025 గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా దివ్య దేశ్‌ముఖ్ రికార్డు సృష్టించింది. ఫైనల్‌లో దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపిపై ఆమె విజయం సాధించింది. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ ప్లేయర్ విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ సహా పలువురు క్రీడాకారులు అర్జున పురస్కారాన్ని స్వీకరించారు. కాగా, జపాన్ మాస్టర్స్‌లో పాల్గొంటున్నందున మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి గోపీచంద్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగం 'అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం)' అందుకున్నాడు. వివిధ క్రీడల్లో అత్యుత్తమ కోచ్‌లకు అందించే ద్రోణాచార్య అవార్డును అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ప్రదానం చేశారు. సాహస క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలను అందజేశారు. క్రీడల ప్రోత్సాహానికి విశేష కృషి చేసినందుకు గాను పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్' లభించింది. లెఫ్టినెంట్ కల్నల్ దల్జీత్ సింగ్ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు క్రీడా మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 18న అవార్డు గ్రహీతల తుది జాబితాను ప్రకటించింది. సాధారణంగా ప్రతి ఏటా ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29న ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది. అయితే, ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరిగిన సంవత్సరాల్లో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తుంటారు. ఈ క్రమంలోనే ఏడాదికి పైగా ఆలస్యంగా 2025 సంవత్సరపు అవార్డులను ఇప్పుడు ప్రదానం చేశారు.

అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరం

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన ఆయన, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదంటూ ఘాటుగా బదులిచ్చారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఘన చరిత్ర గాంధీ కుటుంబానిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. "పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క గ్రూప్-1 నోటిఫికేషన్ అయినా ఇచ్చారా?" అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా, పకడ్బందీగా పరీక్షలు కూడా నిర్వహించిందని వివరించారు. కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని అమలు చేసే సత్తా కూడా ఉందని స్పష్టం చేశారు. అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం వింతగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫార్ములా ఈ రేస్ వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలకు కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నేరెళ్లలో దళితులపై దాడులు, ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేయడం, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీఛార్జ్ వంటి ఘటనలు బీఆర్ఎస్ పాలన వైఫల్యాలకు నిదర్శనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

టీటీడీకి రూ.10 కోట్ల విరాళం
ఇచ్చిన హైదరాబాద్ భక్తుడు

తిరుపతి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులకు నిత్యాన్నదానం అందించే అన్నప్రసాదం ట్రస్టుకు మరో భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు కొడాలి శ్రీకాంత్ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 కోట్ల భారీ మొత్తాన్ని విరాళంగా సమర్పించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో జరిగిన కార్యక్రమంలో దాత కొడాలి శ్రీకాంత్ తన విరాళానికి సంబంధించిన రూ.10 కోట్ల చెక్కును టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలకు వచ్చే వేలాది మంది భక్తుల ఆకలి తీర్చే అన్నప్రసాదం ట్రస్టుకు ఇంతటి భారీ విరాళాన్ని అందించినందుకు గాను దాత శ్రీకాంత్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాతకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్వో) మురళీకృష్ణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కలియుగ వైకుంఠమైన తిరుమలలో నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగేందుకు శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు ఎంతో కీలకపాత్ర పోషిస్తోంది. భక్తుల నుంచి వచ్చే ఇటువంటి ఉదార విరాళాల ద్వారానే రోజువారీగా లక్షలాది మందికి అన్నప్రసాద వితరణ సాధ్యమవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే
చూస్తూ ఊరుకోం: హరీశ్ రావు హెచ్చరిక

హైదరాబాద్: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నిరసనకు సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి. కూకట్‌పల్లిలో ప్రజావసరాల కోసం కేటాయించిన 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ఈ నెల 27న ప్రభుత్వం వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తుండటంతో ఈ నిరసన మొదలైంది. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందలతో కలిసి హరీశ్ రావు ట్రక్ పార్క్ స్థలాన్ని పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. భూముల వేలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ట్రక్ పార్క్ భూములు అమ్మితే ఊరుకోం. భూములు అమ్మడమే ప్రభుత్వ పనా? ఎక్కడ భూమి కనబడినా అమ్ముడేనా? రేవంత్ రెడ్డి పాలన కాకుండా.. రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మబోమని చెప్పారు. ఇప్పుడు భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారు. కాప్రా, అమీన్‌పూర్‌లలో కూడా ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు. గతంలో 2013లోనూ ఇదే భూమిని విక్రయించేందుకు ప్రయత్నించినప్పుడు రాజకీయ పక్షాలన్నీ ఏకమై అడ్డుకున్నాయని నేతలు పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాలను వ్యాపార ప్రయోజనాల కోసం అమ్మడం సరికాదని, ప్రభుత్వం వెంటనే ఈ వేలాన్ని విరమించుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.

ఐటీ శకం ముగిసింది.. ఇక ఏఐ, క్వాంటం యుగం

అమరావతి: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు 12 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఏపీ సీఆర్‌డీఏ, ఏపీ మారిటైమ్ బోర్డు, ఐటీ ఎలక్ట్రానిక్స్‌తో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పీ4 నమూనాకు సంబంధించి ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన జీవోలను సీఎం స్వయంగా సంస్థల ప్రతినిధులకు అందజేశారు. ఈ సదస్సులో పేదల సంక్షేమం, సాధికారతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. స్వర్ణాంధ్ర ఫౌండేషన్‌తో కలిసి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా హీరో మోటోకార్ప్ సంస్థ 28 జిల్లాల్లోని 1,120 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు రూ.32.48 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. అలాగే, 100 గ్రామాల్లోని 25 వేల 'బంగారు కుటుంబాల' జీవనోపాధి, జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఐటీసీ లిమిటెడ్ ఆ కుటుంబాలను దత్తత తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పీ4 కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 11.37 లక్షల కుటుంబాలను వివిధ సంస్థలు, వ్యక్తులు దత్తత తీసుకోగా, లక్ష మందికి పైగా మార్గదర్శకులుగా నమోదయ్యారు. సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "పెట్టుబడులు లేకపోతే సంపద సృష్టి జరగదని.. అందుకే తాను పీపీపీ(పీ3), పీ4 మోడల్‌ను నమ్ముతున్నట్లు" స్పష్టం చేశారు. ఐటీ శకం ముగుస్తోందని, ఏఐ, క్వాంటం శకం మొదలైందని ఆయన వివరించారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే సంస్కరణలు వేగవంతమవుతాయని, తలసరి ఆదాయంలో ఏపీ ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. "నా పాలసీల వల్లే స్థానిక ఎన్నికల్లో మా ఓట్ షేర్ పెరిగింది. ప్రజలకు మంచి చేస్తే.. వాళ్లే ఆశీర్వదిస్తారు" అని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో 4 పీఆర్‌టీఎస్ కారిడార్లు..
ఏడాదిలోనే తొలిదశ పూర్తి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. నగరంలో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ ప్రాజెక్టుపై అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఏడాదిలోగా తొలి దశను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం గడువు విధించారు. ప్రస్తుతం ఉన్న మెట్రో రైలు వ్యవస్థకు అనుబంధంగా, చివరి గమ్యస్థానానికి (లాస్ట్ మైల్), స్వల్ప దూర ప్రయాణాలకు ఈ పీఆర్‌టీఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నగరంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల మధ్య సులభమైన, వేగవంతమైన రాకపోకలను సాధ్యం చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ వ్యవస్థతో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా, కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిపాదిత కారిడార్లు ఇవే..

తొలి దశలో భాగంగా అధికారులు నాలుగు కీలక కారిడార్లను ప్రతిపాదించారు.

ఒకటి: ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్ స్టేషన్ వరకు. రెండు: అసెంబ్లీ మెట్రో స్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమ్యాక్స్ మీదుగా బేగంపేట వరకు.

మూడు: పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ల వరకు.

ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే కేపీహెచ్‌బీ - మైండ్‌స్పేస్ మార్గాన్ని తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కార్యకలాపాలకు మద్దతుగా నెక్లెస్ రోడ్ మరియు గచ్చిబౌలిలోని ఐకియా సమీపంలో ప్రత్యేక డిపోలతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సముదాయాలను నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

ఏపీలో 1.5కు పడిపోయిన సంతానోత్పత్తి రేటు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంలో తీసుకువచ్చిన వ్యూహాత్మక మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాల నుంచి బయటకు వచ్చి, ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు వేగంగా పడిపోతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రంలో జనాభా నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌లో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) గణనీయంగా తగ్గి ప్రస్తుతం దాదాపు 1.5 వద్దకు చేరుకుంది. జనాభా సమతుల్యతను కాపాడేందుకు అవసరమైన 2.1 రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే ఇది చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎదురవుతున్న వృద్ధాప్య జనాభా సమస్య, యువ శ్రామిక శక్తి కొరత వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం ఈ విధాన మార్పును తెరపైకి తెచ్చింది. విశాఖలో జరుగుతున్న 31వ సీఐఐ సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మకు ఇచ్చిన ముఖాముఖిలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై మాట్లాడారు. గతంలో ఒకటి లేదా ఇద్దరు పిల్లలకే పరిమితం కావాలని తానే స్వయంగా ప్రచారం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వచ్చిన మార్పులు, దీర్ఘకాలిక పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలు, అధిక జనాభా వల్ల కలిగే ప్రయోజనాలను (డెమోగ్రాఫిక్ డివిడెండ్) దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. ఎక్కువ మంది పిల్లలను కనేలా కుటుంబాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కీలక ప్రోత్సాహకాలను సిద్ధం చేసింది. రెండో లేదా మూడో బిడ్డకు జన్మనిస్తే నగదు ప్రోత్సాహకాలు, నెలవారీ భత్యాలు, విస్తరించిన తల్లిదండ్రుల సెలవులు (పేరెంటల్ లీవ్), పిల్లల సంరక్షణకు అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి చర్యలను ఇందులో పొందుపరిచారు. అయితే, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లల విధానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం చాలా కష్టమైన విషయమని చంద్రబాబు స్వయంగా అంగీకరించారు. అమలులో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల భవిష్యత్తుకు ఇది మంచిదని నమ్మినప్పుడు ఈ విధానానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, పెరుగుతున్న జీవన వ్యయం, నిరుద్యోగ సమస్యల కారణంగా ఈ పాలసీపై ఆశించిన మేర స్పందన కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు చేసిన ఈ ప్రతిపాదనలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారంతో పాటు విస్తృత చర్చ జరుగుతోంది.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక

శబరిమలై అయ్యప్ప భక్తులకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం

వికారాబాద్ డిపో ఆధ్వర్యంలో అద్దె బస్సులు అందుబాటులోకి..

36 సీట్ల అత్యాధునిక సౌకర్యాల బస్సుల ఏర్పాటు

వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రత



వికారాబాద్, లోకల్ గైడ్ (జిల్లా ప్రతినిధి) : శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రత ఆధ్వర్యంలో ప్రత్యేక అద్దె బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు, యాత్రకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. భక్తుల కోసం 36 సీట్ల సామర్థ్యం గల అత్యాధునిక (ఏసీ రహిత) బస్సులను ఏర్పాటు చేశారు. కిలోమీటరుకు రూ. 59 అద్దెతో పాటు, గంటకు రూ. 300 నిరీక్షణ రుసుము, 5 శాతం పన్ను (జీఎస్టీ), తాత్కాలిక అనుమతి పత్రం కోసం రూ. 565 చెల్లించాల్సి ఉంటుంది. అయ్యప్ప యాత్రలతో పాటు వివాహాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, విహారయాత్రలు, కుటుంబ ప్రయాణాల కోసం కూడా ఈ బస్సులను ముందస్తుగా అద్దెకు తీసుకోవచ్చు. ముందస్తు నమోదు కోసం వికారాబాద్ డిపో కార్యాలయం లేదా ఆర్టీసీ బస్టాండ్ ను సంప్రదించండి: 99592 26252, 75698 88802, 97040 39427, 99892 41020. భక్తులు, ప్రజలు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ డిపో అధికారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్.



నిర్మల్ : లోకల్ గైడ్: విద్యార్థుల : నైపుణ్యాలను మెరుగుపరచడానికి, సాంప్రదాయ వంటకాలను పరిచయం చేయడానికి ఆహార ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. కుబీర్ మండలం పార్డి (బి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ రకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్లో పాల్గొని తోటివారితో పంచుకున్నారు. ఈ ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా పిల్లల్లో వంట పట్ల అవగాహన పెరగడంతో పాటు, అందరితో కలిసి భోజనం చేయడం ద్వారా 'పంచుకునే గుణం' అలవాటు పడుతుందని, విద్యార్థులు జంక్ ఫుడ్కు పాఠశాల దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన, పౌష్టికాహార పదార్థాలను తీసుకోవాలనే అవగాహన కోసం, ఆహార పదార్థాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వ హించారని ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మోసిన్ తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈయనతోపాటు ఉపాధ్యాయులు రవీందర్, మెట్పల్లి సాయినాథ్, జట్ల రంజిత్, జై సింగ్,జాదవ్ గీత కుమార్ గ్రామస్తులు కే. గంగాధర్, అఫ్రోజ్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : నల్గొండ పట్టణంలోని 24వ వార్డు మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ పార్థివ దేహానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాతంగి సత్యనారాయణ ప్రజాప్రతినిధిగా అందించిన సేవలను, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని గుత్తా సుఖేందర్ రెడ్డి గారు స్మరించుకున్నారు.ప్రజా సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.సత్యనారాయణ మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం

వడ్డేపల్లి గవర్నమెంట్ హై స్కూల్ లోన్యాయ విజ్ఞాన సదస్సు



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13(లోకల్ గైడ్ న్యూస్) : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం హనుమకొండ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి.ఎల్.ఎస్.ఏ.), వారి ఆధ్వర్యంలో వడ్డేపల్లి గవర్నమెంట్ హై స్కూల్ లో జాతీయ న్యాయ సేవల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆరొవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, కుమారి డి.మధులిక తేజ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 9 న జాతీయ న్యాయ సేవల దినోత్సవం (చీఃఅశీఱశ్రీ ూవస్త్రశ్రీ ూవతీఙఱఎవం ఋఱవ) ను నిర్వహిస్తారని 1987 నాటి లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్ (ూవస్త్రశ్రీ ూవతీఙఱఎవం ూబ్ష్రశీతీఱ్‌అవం ూష్‌, 1987) నవంబర్ 9, 1995 నుంచి అమల్లోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమం లో విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ప్రాథమిక విద్యను ఉచితంగా, నిర్బంధంగా అందించాలని తెలిపారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, 2006 ప్రకారం భారతదేశంలో బాల్య వివాహాలు చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు, బాల మరియు కౌమార కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, 1986 (2016 సవరణ) ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలతో ఏ విధమైన పని చేయించడం పూర్తిగా నిషేధం అని తెలిపారు.బాలబాలికలకు ఏదైనా లైంగిక వేధింపులకు గురైతే ముఖ్యంగా తల్లిదండ్రులకు లేదా పాఠశాల సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయమన్నారు. పిల్లలు అందరు సెల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలి, ఎక్కువ సమయం చదువుకోడానికి మాత్రమే కేటాయించాలని, అదేవిదంగా లైసెన్స్ లేకుండా వాహనములు నడపకూడదని కొత్త వ్యక్తులతో చేదు స్నేహాలు చేయకూడదని, కొత్త వ్యక్తులతో వారి ఫొటోస్ వీడియోస్ షేర్ చేయకూడదని తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల హెడ్ మాస్టర్ కే. సురేష్ , డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఏం కవిత, కేయూ. సిఐ. ఎస్. రవి కుమార్ తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇట్లు
జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ
హనుమకొండ

ఎస్.ఆర్. నేషనల్ హైస్కూల్ లో న్యాయ అవగాహన కార్యక్రమం

జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఫరీహా అహ్మద్...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13 (లోకల్ గైడ్ న్యూస్): జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎస్.ఆర్. నేషనల్ హైస్కూల్లో న్యాయ అవగాహన కార్యక్రమం.హనుమకొండ, జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండలోని అడ్వకేట్స్ కాలనీలో గల ఎస్.ఆర్. నేషనల్ హైస్కూల్లో విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఫరీహా అహ్మద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో సుబేదారి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె. సతీష్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. సుభాష్, పాఠశాల ప్రిన్సిపాల్ వీణాధరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 కోట్ల33 లక్షలతో 61,63,8 వ డివిజన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నాయిని...

ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలు....

ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13(లోకల్ గైడ్ న్యూస్) : అభివృద్ధి అంటే జీవోలు, పత్రికా ప్రకటనలకే పరిమితం కాదు.. క్షేత్రస్థాయిలో చేసి చూపిస్తున్నాం.. శుక్రవారం,రొజున వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు రాజేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 61వ డివిజన్ ప్రశాంత్ నగర్, 63వ డివిజన్ తిలక్ నగర్,8 వ డివిజన్ మార్కస్ స్కూల్ ఆవరణలో సుమారు రూ.2.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజాపాలనలో భాగంగా



అభివృద్ధి అంటే కేవలం జీవోలు తీసుకురావడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, ప్రెస్‌మీట్లు నిర్వహించడం మాత్రమే కాదని, ప్రజల సాక్షిగా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, వాటిని పూర్తి చేసి చూపించడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారంరోజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన పనులను నిర్దేశిత కాలపరిమితిలో



పూర్తి చేయడంతో పాటు నాణ్యతా నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వరంగల్ నగరానికి రాబోయే 30 నుంచి 40 ఏళ్ల వరకు తాగునీరు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరలో చేపట్టనున్న నేపథ్యంలో భవిష్యత్తులో మళ్లీ రోడ్లను తవ్వాల్సిన పరిస్థితి రాకుండా సమన్వయంతో పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.550 కోట్లతో 4 నుంచి 8 ఇంచుల పైప్‌లైన్ వ్యవస్థను విస్తరించే ప్రణాళిక ఉందని, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సామర్థ్యాన్ని కూడా పెంచి రాబోయే మూడు, నాలుగు దశాబ్దాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని కలిసి వరంగల్ అభివృద్ధికి అవసరమైన పలు కీలక ప్రాజెక్టులను సాధించుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం, తాగునీటి పైప్‌లైన్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులు ప్రత్యేక చొరవతో ముందుకు వస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు, అనుమతుల విషయంలో సహకరిస్తున్నారని



పేర్కొన్నారు.గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజల మధ్యకు వచ్చే నాయకులం తాము కాదని, ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రతిరోజూ రెండు డివిజన్లలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎన్ని నిధులు ఖర్చు చేశామో లెక్కలతో సహా ప్రజల ముందుంచడానికి సిద్ధమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.వరంగల్ పశ్చిమనియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు...

రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛనులు

నేలకొండపల్లిలో లబ్ధిదారులకు క్రొత్త చేయూత పింఛన్ల మంజూరు ఆర్డర్లను పంపిణీ చేసిన మంత్రి

నేలకొండపల్లి, నవంబర్- 13: లోకల్ గైడ్ : పేదవాని సంక్షేమమే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు 7-8 సంవత్సరాల నుంచి భర్తలను కోల్పోయి, తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆడబిడ్డల బాధలను గతంలో గ్రామాల్లో నేరుగా వారి ఇంటికి వెళ్లినప్పుడు ప్రత్యక్షంగా చూశామని, వారి మనసులోని వేదనను స్వయంగా పంచుకున్నామని తెలిపారు. కేవలం ఆడబిడ్డలే కాకుండా, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు ఇలా వందలాది మంది పడిన వేదనను ఈ ప్రజా ప్రభుత్వం స్వయంగా చూసిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాళ్లకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్ అందించాలనే లక్ష్యంతో మొన్న దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి పైగా అర్హులకు పింఛన్లు అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత 7-8 సంవత్సరాలుగా కాళ్లు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగిన మహిళలకు దీపావళి నాడు వారి ఇంట్లోనే శుభవార్త చెప్పడం జరిగిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో క్రొత్తగా 1,138 మందికి ఆసరా పింఛన్లు



అందజేయడం జరుగుతోందన్నారు. ఈ మండలానికి గతంతో కలుపుకొని ప్రతి నెలా రూ. ఒక కోటి 82 లక్షలు ప్రజా ప్రభుత్వం ద్వారా నేరుగా పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత బాగాలేకపోయినా, పేదవాళ్ల వద్దకు, ఆడబిడ్డల వద్దకు, వికలాంగులు, గీత, చేనేత కార్మికుల వద్దకు ఒక్క అడుగు కూడా వెనకడుగు వేయకుండా పూర్తి భరోసా కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రధాన ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పెద్దోళ్లు తినే సన్నబియ్యాన్ని ఇకపై పేదోళ్లందరూ తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం 7 సంవత్సరాలు ఎదురుచూసిన వారికి, కొత్త కోడళ్లు లేదా కొత్త సభ్యులు చేరిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం రాగానే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సులో ఎంత దూర ప్రయాణం చేసినా ఉచిత బస్సు సౌకర్యాన్ని విజయవంతంగా కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రూ. 73 వేల కోట్ల రూపాయలను సున్నా వడ్డీ కింద ఇస్తున్నామని, ఇందులో భాగంగానే మహిళలకు పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు కూడా సాంక్షన్ చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పూర్తి మద్దతుగా నిలుస్తున్నామని మంత్రి అన్నారు.రైతును రాజును చేస్తామన్న మాటకు కట్టుబడి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ



చేశామని, ఎకరానికి రూ. 12 వేలు రెండు విడతలుగా రైతు భరోసా అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతన్నలకు మొదటి పంటకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కాళేశ్వరం కడితే లక్ష కోట్లు కమీషన్ వస్తుంది కాని, పేదోడికి ఇళ్లు ఇస్తే కమీషన్ రాదన్న దుర్బుద్ధితో గత పాలకులు వ్యవహరించారని, కానీ ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని, అలాగే హైదరాబాదులో ఒక లక్ష ఇళ్లు, మొత్తం 8 లక్షల ఇళ్లు రూ. 40 వేల కోట్లతో పేద ఆడబిడ్డలకు ఇస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకతీతంగా పింక్ షర్టు వేసుకుని వచ్చినా, అర్హులైన ప్రతి పేద మహిళకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. చేయూత పింఛనుల కోసం ఎవరైనా అర్హులు మండలానికి ఒకరిద్దరు మిగిలిపోయి ఉంటే, వారిని కూడా విస్మరించకుండా త్వరలోనే న్యాయం చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కె. శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎంపిడిఓ ఎర్రయ్య, తహసీల్దార్ రాంప్రసాద్, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓగా కళ్యాణి నియామకం

కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13(లోకల్ గైడ్ న్యూస్) : హనుమకొండ, కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) మూడవ విభాగం కార్యక్రమ అధికారిగా (ప్రోగ్రాం ఆఫీసర్ గా) కళాశాల సామాజిక శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ ఆర్. కళ్యాణి నియమితులయ్యారు. ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి నియామక ఉత్తర్వులను డాక్టర్ కళ్యాణికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేస్తూ గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన, సామాజిక చైతన్యం వంటి అంశాలపై విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులను సామాజిక సేవా దృక్పథం కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహ్మాన్, డాక్టర్ చందర్, శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13(లోకల్ గైడ్ న్యూస్) : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా,గీసుకొండ మండలం, ఊకల్ హవేలి గ్రామంలో ఉన్న శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం రోజున దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్తలూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

17న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు రాజకీయాలకు అతీతంగా తరలిరండి.

సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ పిలుపు .





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో ప్రాథమిక ఉప కేంద్రంను నిర్మించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అధికారుల నిదర్శనమనీ సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, డివిజన్ నాయకులు సిలువేరు జానయ్య లు అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఈనెల 17నిర్వహించే ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం ముట్టడికి సంబంధించిన కరపత్రాలు చిత్తలూరు గ్రామంలో ఆవిష్కరణ చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ సుమారు రూ. 16 లక్షల ప్రజాధనంతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉండటం విచారకరమనీ, గ్రామంలో సుమారు 3 వేల మంది ప్రజలు నివసిస్తున్నప్పటికీ అత్యవసర వైద్య సేవల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.పాము, తేలు, కుక్కలు, కోతులు కరిచినప్పుడు, ఇతర అత్యవసర ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోందని, ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభమైతే ప్రాథమిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు, అత్యవసర చికిత్స సదుపాయాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్య హక్కును నిర్లక్ష్యం చేస్తూ నిర్మించిన భవనాన్ని నిరుపయోగంగా ఉంచడం సమంజసం కాదని, ఇప్పటికైనా స్థానిక ఎం యల్ ఏ , సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని, లేనిపక్షంలో ఈ నెల 17వ తేదీన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేస్తామని, ఈ ఆందోళనకు చిత్తలూరు గ్రామ ప్రజలు రాజకీయాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలపాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నల్లగొండ జిల్లా కార్యదర్శి సాగర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ కే యం ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల శంకర్, పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సిలివేరు సునీత, తుడి శ్రీశైలం, ఇంద్రకశీటీ శంబయ్య, బోడ శంబయ్య, గిరగాని యాదగిరి, రాజయ్య, వెంకన్న, గాదగాని అండాలు, నీలమ్మ, గుగ్గిళ్ల వెంకటయ్య, యాదగిరి, మరిపెల్లి వీరయ్య, శింతలూరు శంకర్, దేగల యల్లమ్మ, తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

మెట్టుగుట్ట శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కి అభిషేకము

ఆలయ కార్యనిర్వహణాధికారి వా.సత్యనారాయణ... వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13(లోకల్ గైడ్ న్యూస్) : వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టుగుట్టపై శుక్రవారము నాగుల చవితి సందర్భముగా కుజ,కాల సర్పదోషాలతో భాదపడుతున్న సర్పజనులకు లోక కళ్యాణార్థము ఉదయం 09:00 గం.లకు ఆలయ ప్రాంగణంలో గల శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఫల పంచామృతాలచే అభిషేకము చేయడం జరిగినది. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుండే శ్రీ మెట్టుగుట్టపైకి విచ్చేసి స్వామి వారిని దర్శించి, అభిషేకం చేసి, ఆలయ ప్రాంగణంలో గల పుట్టకు పాలు పోసి మొక్కలు చెల్లించుకున్నారు. తదుపరి సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శివ కేశవులకు ఆకాశ దీపోత్సవం నిర్వహించి, శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి ప్రదోషకాల రుద్రాభిషేకం చేసి, అలంకరణ చేసి, నీరాజన మంత్ర పుష్పం సమర్పణ చేసి, హారతులు, పవళింపు సేవ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి వా. సత్యనారాయణ మరియు శివాలయ పునరుద్ధరణ కమిటీ చైర్మెన్ శ్రీ పి. రఘుచందర్ గార్ల ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ గారు, పరాశరం విష్ణువర్ధనాచార్యులు గారు, పారుపల్లి సత్యనారాయణ శర్మ గార్లు నిర్వహించగా, ధర్మకర్తలు భోగి కేదారి గారు, బైరి రాజు గారు, దండిగం శ్రీనివాస్ గారు, రొడ్డ దయాకర్ గారు, వస్కుల ఉమ గారు, మాడిశెట్టి జ్ఞానేశ్వరి గారు, తదితర భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం నిర్వహించాలి



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 13 : 'నషా ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా రూపొందించిన మత్తుపదార్థాల నివారణ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డి ఈ ఓ మాధవి, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మనోహర్ రావు, స్టేట్ ఈసీ మెంబర్ రాజేశ్వరరావు, డైరెక్టర్లు రాజు, బండారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు అదనంగా 18 పీజీ వైద్య సీట్లు మంజూరు

జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఘనంగా సన్మానించిన రిమ్స్ వైద్య బృందం



అదిలాబాద్ లోకల్ గాడ్ నవంబర్ 13 : ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో వైద్య విద్య, వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా రిమ్స్‌కు అదనంగా 18 పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్‌తో పాటు వైద్యుల బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిశారు. పీజీ సీట్ల మంజూరుకు విశేష కృషి చేసిన కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అదనపు పీజీ సీట్లతో రిమ్స్‌లో వైద్య విద్యావకాశాలు మెరుగుపడటంతో పాటు, భవిష్యత్తులో నిపుణులైన వైద్యుల తయారీకి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడనుంది.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ను కాపాడండి.

సి .ఎస్ .సి .హెల్త్ టెస్ట్ లు రద్దు చేయాలీ.

బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తే ఉందనీ సంక్షేమ బోర్డ్ పరిరక్షణ కోసం పోరాటం తీవ్ర తరం చేయాలని ఏఐటియుసి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నల్లగొండ జిల్లా డిసీఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఐ. టి. సి. సెంటర్ల నిర్మాణము కోసం రక్త పరీక్షల కోసం సి. ఎస్. సి. హెల్త్ సెంటర్ వారికి ఖర్చు చేస్తున్నారనీ అన్నారు.. సహజ మరణం, ప్రమాద మరణాలు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పి కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేసింది. జులై 2026 వరకు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీ వారి అగ్రిమెంట్ అయిపోయింది. డెత్ క్లెయిమ్ లు లేబర్ డిపార్ట్మెంట్ వారు తీసుకోకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి ధారధాతం చేసి సంక్షేమ బోర్డును దివాలా తీయించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.ఆధార్ అప్డేట్ మరియు పేర్లు సరి చేయడం రెన్యువల్ అప్డేట్ చేసే అధికారం ఏ ఎల్ వో కు లేకుండా అన్ని రాష్ట్ర బోర్డు దగ్గర పెట్టుకొని కార్మికులను ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.. నెలల తరబడి క్లెములు పెండింగ్లో పెడుతూ కార్మికులకు డబ్బులు మంజూరు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మీ సేవల వద్ద దళారి వ్యవస్థ పెరిగిపోయి నిజమైన కార్మికులకు న్యాయం జరగడం లేదు. ఖాళీగా ఉన్న ఏ ఎల్ ఓ, డి సి ఎల్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి. కార్మికుల అడ్డాల వద్ద షెల్టర్లు నిర్మించాలి. భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి.50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సి .ఎస్. సి .హెల్త్ టెస్ట్ లు రద్దు చేయాలి, సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రతినిత్యం కల్పించాలనీ కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ కే ఎస్ రెడ్డి,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు , ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్,సహాయ కార్యదర్శి ఏం డి జానీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బెల్లం శివయ్య గుండె రవి,రేవల్లి యాదయ్య , నరసింహ,లక్ష్మీ నరసయ్య, బి శ్రీను ,ఏ మల్లయ్య, నాగార్జున, జి నరేందర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఆరోగ్య సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నషా విముక్త్ భారత్ లో భాగంగా పాఠశాల విద్యార్థులకు చేపట్టిన క్విజ్ పోటీల కార్యక్రమంలోపాల్గొన్న మంత్రి





ఖమ్మం, నవంబర్ - 13: లోకల్ గైడ్ : మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్త్ భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన సెక్షన్లు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. కేవలం వినియోగదారులపైనే కాకుండా, డ్రగ్స్ సరఫరా మూలాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పాలనలో డ్రగ్స్ నియంత్రణపై చిత్తశుద్ధి కొరవడిందని, మాజీ మంత్రుల ఫామ్‌హౌస్‌లలో సైతం డ్రగ్స్ పట్టుబడటం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ ఉన్నాయన్న భయంతోనే నాటి మంత్రులు తమ పిల్లలను విదేశాల్లో చదివించుకున్నారని విమర్శించారు. కేవలం పోలీసు, ఎక్సైజ్ శాఖల వల్లే డ్రగ్స్ నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని, ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్నతనంలోనే పిల్లల ప్రవర్తనను గమనించి, చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా వారిని కట్టడి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా కన్నేసి ఉంచాలని కోరారు. విద్యార్థులు ఫ్యాషన్ కోసమో, స్నేహితుల ఒత్తిడిలోనో మత్తు పదార్థాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మంత్రి హితవు పలికారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, చదువుపైనే పూర్తి దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా..

సూర్యాపేట పోలీసుల చాకచక్యంతో ముఠా గుట్టురట్టు.

112 కిలోల గంజాయి స్వాధీనం..

ఇద్దరు నిందితుల అరెస్ట్.

రూ.25 లక్షల విలువైన గంజాయి పట్టివేత.

ఇన్నోవా కారులో 41 ప్యాకెట్లలో గంజాయి తరలింపు.

గంజాయి రవాణాకు ఉపయోగించిన ఇన్నోవా కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం.

ఒడిశా ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలింపు.

ఎస్కార్ట్‌గా మరో కారును ముందు నడుపుతూ పోలీసుల కదలికలపై నిఘా.

కారు బ్రేక్‌డౌన్ కావడంతో వాహనాన్ని వదిలి పరారీ.

తిరిగి వాహనాన్ని తీసుకెళ్లేందుకు సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితుల అరెస్ట్.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఏమాత్రం ఉపేక్షించేది లేదు.

సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ : జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ఇందులో భాగంగా సూర్యాపేట ×× టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి అక్రమ రవాణాకు పథకం రూపొందించారు. ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశా రాష్ట్రంలోని జగన్నాథపురి ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కిలో రూ.2,000 చొప్పున మొత్తం 112 కిలోల గంజాయిని రూ.2.24 లక్షలకు కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని 41 ప్యాకెట్లుగా తయారుచేసి ఇన్నోవా కారులో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు బయలుదేరారు. పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మరో ఎర్టిగా కారును ఎస్కార్ట్‌గా ముందు నడుపుతూ, పోలీసుల కదలికలను గమనిస్తూ వెనుక వస్తున్న ఇన్నోవా వాహనానికి సమాచారం అందించేవారు. ఈ క్రమంలో నవంబర్ 7వ తేదీన సూర్యాపేట పట్టణ శివారులోని చీన-65 జాతీయ రహదారిపై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో ఇన్నోవా కారు బ్రేక్‌డౌన్ అయింది. దీంతో నిందితులు వాహనాన్ని రహదారి పక్కన వదిలి పరారయ్యారు. అనుమానాస్పదంగా కారు నిలిపి ఉన్నట్లు సమాచారం అందడంతో సూర్యాపేట ×× టౌన్ ఎస్సైలు కె. గోపికృష్ణ, బి. రామచంద్రం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని తనిఖీ చేయగా, 41 ప్యాకెట్లలో 112 కిలోల గంజాయి గుర్తించారు. వెంటనే పంచుల సమక్షంలో గంజాయితో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు నవంబర్ 12వ తేదీన సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు గంజాయి అక్రమ రవాణాలో పాల్గొన్నట్లు వెల్లడైంది.

అరెస్టయిన నిందితులు:

1. ఆకాష్ విజయ్ దాబేకర్ (23), బీడ్ జిల్లా, మహారాష్ట్ర.

2. ఆకాష్ దిలీప్ మోరే (32), బుల్దానా జిల్లా, మహారాష్ట్ర.

వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని, ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, కొనుగోళ్లు, వినియోగంపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. గంజాయి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు.

ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐ వెంకటయ్య, సిబ్బంది ఎస్ఐ లు గోపికృష్ణ, రామచందర్, ఉన్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట ×× టౌన్ ఎస్సైలు కె. గోపికృష్ణ, రామచందర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్. నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

తల్లాడ మండలంలో చేయూత పెన్షన్ మంజూరు

పత్రాల పంపిణీ చేసిన ఎంపీ రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

- లబ్ధిదారులకు చేయూతనందిస్తున్న ప్రజా ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



సత్తుపల్లి :, తల్లాడ /: లోకల్ గైడ్:మండలం గార్లెన్స్‌లో మండలానికి సంబంధించిన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు మంజూరైన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు శ్రీ రామసహాయం రఘురాం రెడ్డి గారితో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరాల తరబడి కొత్త పెన్షన్లు మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ల కోసం ఎదురుచూస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. నేడు పెన్షన్లు మంజూరైన లబ్ధిదారుల తరఫున ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కల నెరవేర్చడం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్, మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, వడ్డీలేని రుణాలు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు, పేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారు, మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు, మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి అండగా నిలుస్తున్న ముగ్గురు మంత్రులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఖమ్మం ఎంపీ శ్రీ రామసహాయం రఘురాం రెడ్డి గారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ శ్రీ రామసహాయం రఘురాం రెడ్డి గారు మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పెన్షన్లు అనేవి కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు తోడ్పడే భరోసా అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, సంక్షేమం మరియు అభివృద్ధి రెండు లక్ష్యాలుగా ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ కార్యక్రమంలో అధికారులు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ +. లక్ష్మీ రెడ్డి గారు, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

తమ్మిడికుంట చెరువు పునరుజ్జీవనానికి సిఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

చెరువు పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత

కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ యువ నాయకుడు.. మిరియాల ప్రీతమ్



శేరిలింగంపల్లి, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ) : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ పరిధిలోని తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, పునరుజ్జీవన పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ యువ నాయకుడు మిరియాల ప్రీతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ ఆవశ్యకతపై నాయకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ నేపథ్యంలో చెరువుల పరిరక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. గతంలో వర్షపు నీటిని నిల్వ చేయడంలో, భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడటంలో చెరువులు ముఖ్యమైన పాత్ర పోషించేవని తెలిపారు. అలాంటి చెరువులను తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించవచ్చని అభిప్రాయపడ్డారు. తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని, చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. చెరువుల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజలందరి భాగస్వామ్యంతోనే విజయవంతమవుతుందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళన ఉత్సవంలో పాల్గొన్న మారబోయిన రవి యాదవ్

-యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

-ఐక్యతను చాటిచెప్పిన సదర్ వేడుక



సైబరాబాద్, నవంబర్ 13(లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): గోకుల్ ప్లాట్స్ సమీపంలోని విజేత సూపర్ మార్కెట్ వద్ద గురువారం యాదవ సోదరులు, ఎస్ఎస్ జీవై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళన ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు శేరిలింగంపల్లి నాయకులు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ యాదవ సోదరులతో ఆత్మీయంగా మమేకమై, వారితో కలిసి సదర్ ఉత్సవ సంబరాల్లో పాల్గొన్నారు. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళన వేడుకను ఎంతో ఉత్సాహంగా నిర్వహించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాచీనమైనవని, వాటిని కాపాడుకోవడంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సదర్ వంటి పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా సమాజంలోని ఐక్యతను, సోదరభావాన్ని, ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. యాదవులంతా ఐక్యంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజేయాలని సూచించారు. సదర్ సమ్మేళన ఉత్సవం సందర్భంగా యాదవ సోదరులతో గడపడం ఎంతో ఆనందంగా ఉందని మారబోయిన రవి యాదవ్ తెలిపారు. ఈ వేడుక యాదవుల ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ,మాజీ కౌన్సిలర్, మాతంగి సత్యనారాయణ పార్థివదేహాన్ని నల్గొండ మాన్యంచెల్కలోని వారి నివాసం సందర్శించి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ సత్యనారాయణ ప్రజల మనిషని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేసి.. మంచి పేరు సంపాదించుకున్నారని. వారి మరణం తనకు ఆవేదన కలగజేసిందని.. భగవంతుడు వారికి ఆత్మ శాంతి కలగజేసి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కలగ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్ నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, గోపగోని స్వాతి రాజశేఖర్,పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, మాజీ కౌన్సిలర్ లు..రావుల శ్రీనివాస్ రెడ్డి మహమ్మద్ సమీ, మెరుగు గోపి, అల్లి వేణు జమాల్ ఖాద్రి... పెరిక కరణ్ జయరాజ్, భాష పాక హరి కృష్ణ మాతంగి అమర్,పెరిక రమేష్... తదితరులు వెంట ఉన్నారు

భారత్ సమ్మిట్-2026తో తెలంగాణ వేదికగా సరికొత్త ప్రపంచానికి నాంది

70కి పైగా దేశాల అంతర్జాతీయ ప్రతినిధుల భాగస్వామ్యం

రాహుల్ గాంధీకి మిరియాల ప్రీతమ్ ఘన స్వాగతం



హైదరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ వేదికగా ప్రపంచ దేశాల మధ్య సరికొత్త ఆలోచనలు, చర్చలు, అభివృద్ధి దిశగా భారత్ సమ్మిట్-2026 నిర్వహించడం ఎంతో గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మిరియాల ప్రీతమ్ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా నవంబర్ 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు 70కి పైగా దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు హాజరవుతుండటం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొనేందుకు విచ్చేస్తున్న గౌరవనీయ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మిరియాల ప్రీతమ్ హృదయపూర్వక స్వాగతం పలుకుతూ సాదర ఆహ్వానం తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం వంటి కీలక అంశాలపై ఈ వేదిక ద్వారా విస్తృతంగా చర్చలు జరగనున్నాయని తెలిపారు. అదేవిధంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, గ్లోబల్ సౌత్ దేశాల భవిష్యత్తు, ప్రపంచ అభివృద్ధిలో యువత పాత్ర, నూతన ప్రపంచ నిర్మాణంలో యువత భాగస్వామ్యం వంటి అంశాలకు ఈ సదస్సులో ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సవాళ్లకు పరిష్కార మార్గాలను అన్వేషించడంతోపాటు సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవీయ విలువల ఆధారంగా భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించేందుకు భారత్ సమ్మిట్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని, ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచస్థాయికి తీసుకెళ్తాయని మిరియాల ప్రీతమ్ పేర్కొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రకియ ను వేగవంతం చేసి రానున్న 10 రోజులలో ముగించాలి.

రాష్ట్ర రోడ్ భవనల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ : ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రానున్న 10 రోజుల్లో ముగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ , ధాన్యం సేకరణ అధికారులతో 2026- 27 ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమీక్షించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ,ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ఇందుకు గాను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో 10 రోజుల్లో ధాన్యం కొనుగోలు ముగింపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నల్గొండ ,నకిరేకల్ నియోజకవర్గాలలో ధాన్యం ముందుగానే కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ముందుగా ఈ రెండు నియోజకవర్గాలలో ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉంచేందుకు ప్రభుత్వ గోదాములను వినియోగించుకుంటున్నామని తెలిపారు. వి బీజి రామ్ జి కింద గోదాముల ను నిర్మించుకొనే అవకాశం ఉందని మంత్రి దృష్టి తీసుకురాగా ,మహిళా సంఘాల ఆధ్వర్యంలో గోదాముల నిర్వహణకు ఇదివరకే నిర్ణయించినందున ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వచ్చే 2 సంవత్సరాల నాటికి జిల్లాలో గోదాములను సిద్ధం చేయాలని, 2028 ,జూన్ వరకు ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయితే జిల్లాలో 4 లక్షల ఎకరాలలో పంటలు సాగు అవుతాయని,దీని ద్వారా మరింత దాన్యం పండే అవకాశం ఉన్నందున అప్పటివరకు గోదాములతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రతిరోజు గంటపాటు ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాల్సిందిగా మంత్రి కలెక్టర్ ను ఆదేశించారు. ఎల్ ని నోను దృష్టిలో ఉంచుకొని తాగు , సాగునీరు, విద్యుత్తు ఆరుతడి పంటల సాగు, తదితర అంశాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. కాగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వచ్చే వర్షాకాలం వరకు ఉన్న నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, తాగునీటికి మాత్రమే ప్రస్తుతం ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఉన్న నీరు సరిపోతుందని, ప్రస్తుతం రిజర్వాయర్లు, ప్రాజెక్టులలో ఉన్న నీటి లభ్యత, ఇది ఎప్పటి వరకు సరిపోతుందో కూడా ప్రజలకు తెలియజేస్తున్నామని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్ నినో పరిస్థితిలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా పై మంత్రి ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ శ్రీనివాసరావు తో సమీక్షిస్తూ జిల్లాలో విద్యుత్తు సరఫరా గురించి అడిగారు. జిల్లాలో ప్రస్తుతం 14 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఎలాంటి ఇబ్బంది లేదని ఎస్ ఈ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా నల్గొండ పట్టణంలో దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడెం సమీపంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టనున్నామని, ఇందులో 12 టవర్లలో ఒక్కొక్క టవర్లో 40 చొప్పున 480 ఇండ్లను నిర్మిస్తున్నామని ,ఇందుకు అవసరమైన 6 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం ప్రతిపాదించగా, అందుకు మంత్రి సమ్మతి తెలియజేసి తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. నల్గొండ పట్టణంలో ప్రతి సంవత్సరం 500 చొప్పున 2 వేల ఇండ్లను ఇండ్లు లేని నిరుపేదలకు ఇస్తామని మంత్రి తెలిపారు. సంవత్సరంలోపు ఇందిరమ్మ టవర్ల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాల్సిందిగా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. చందనపల్లి డంపింగ్ యార్డ్ ను మరో చోటికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రామాలు లేని చోట 100 ఎకరాల స్థలం చూడాలని ,అక్కడే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని, అవసరమైతే కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకుని డంపింగ్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయనున్న దృష్ట్యా అక్కడ ఏర్పాటు చేసే పార్కు, చెరువు కట్ట సుందరీకరణ, దేవాలయ అభివృద్ధి, పానగల్ ఉదయ సముద్రం ద్వారా తాగునీటి సరఫరాలను కూడా దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ ను వెంటనే తరలించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ వివరాలను మంత్రికి తెలియజేస్తూ 2026-27 ఖరీఫ్ లో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయడం జరిగిందని ,అందులో 7 లక్షల సన్నధాన్యం, 2 లక్షల 35వేల మెట్రి టన్నుల దొడ్డు ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు గాను జిల్లాలో 307 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని, 100 కేంద్రాలను ప్రారంభించి ,65 కేంద్రాలలో కొనుగోలు ప్రారంభించి ఇప్పటివరకు ఈ కేంద్రాల కు 55174 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ గోదాములలో నిలువ ఉంచినట్లు తెలిపారు .ఈ సమావేశం లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి , పౌరసరఫరాల, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ,తదితరులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

దాతృత్వ స్ఫూర్తిని చాటిన గీతం బీ-స్కూల్ విద్యార్థులు

మియాపూర్ వివేకానంద సేవా సంఘం చిన్నారులతో ఆనందంగా బాలల దినోత్సవ వేడుకలు



పఠాన్ చేరు, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి బి.ఎన్.చంద్ర) : గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ), హైదరాబాద్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దాతృత్వం, మానవత్వం, సేవాభావాన్ని చాటుకున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే 'జాయ్ ఆఫ్ గివింగ్' (ఇవ్వడంలోనే ఆనందం) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మియాపూర్‌లోని వివేకానంద సేవా సంఘం (చిన్నారులు, వృద్ధుల గృహం)కు చెందిన బాలలను గీతం ప్రాంగణానికి ఆహ్వానించి, వారితో రోజంతా ఆనందంగా గడిపారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిన్నారులలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, ఐక్యతా భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించారు. వివేకానంద సేవా సంఘానికి చెందిన స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలో 41 మంది చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంబీఏ విద్యార్థులు చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆకర్షణీయమైన ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు. తమను ఆదరించే వారు, తమ అభివృద్ధిని కోరుకునే వారు ఎందరో ఉన్నారనే భరోసాను చిన్నారుల్లో కల్పిస్తూ ఆత్మీయ వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో గీతం బీ-స్కూల్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ప్రతి ఏడాది ఇలాంటి మంచి సంప్రదాయాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాల్లో కరుణ, మానవత్వం, ఇతరుల పట్ల బాధ్యత ఎంతో ముఖ్యమైనవని వివరించారు. విద్యార్థులు కేవలం విద్యా రంగంలోనే కాకుండా సామాజిక బాధ్యతలోనూ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అధ్యాపకులు డాక్టర్ నాగప్రియ, డాక్టర్ శ్రీకాంత్, విద్యార్థి నిర్వాహకులు శ్లోక, సుచిత సమన్వయం చేశారు. బాలల సంక్షేమం, విద్యాభివృద్ధి పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ సేవా సంఘానికి చెందిన చిన్నారులందరికీ స్వెట్టర్లు, స్టేషనరీ సామగ్రి, టీ-షర్టులను పంపిణీ చేశారు. అదనంగా విద్యార్థులు, అధ్యాపక బృందం చిన్నారుల విద్యావసరాలకు తమవంతు సహకారం అందించారు. చిన్న చిన్న సహాయాలు సైతం బాలల జీవితాల్లో ఎంతో ఆనందాన్ని, ఆశలను నింపగలవని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఇవ్వడంలోనే నిజమైన ఆనందం ఉందనే సందేశాన్ని అందిస్తూ, సామాజిక సేవ, దాతృత్వం, మానవీయ విలువలకు గీతం విద్యార్థులు ప్రతీకగా నిలిచారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం గా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది.

రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు. సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయం నుండే పేద ప్రజల కోసం పనిచేయడం జరుగుతున్నదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల కోసం ఉచిత బస్సు, సన్న బియ్యం , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత చరిత్రలో నిలిచిపోతుందన్నారు.నల్గొండ పట్టణంలోని పేదవారికి దేవరకొండ రోడ్ లో మామిల్లగూడెం వద్ద ఇందిరమ్మ టవర్స్ నిర్మించి 480 ఇండ్లు కట్టించి ఇస్తున్నట్లు తెలిపారు.పార్టీలకతీతంగా పేదవారికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతున్నదని, ఇల్లు లేని వారందరికీ దశలవారిగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు .రాబోయే కాలంలో ప్రభుత్వం పెన్షన్ల మొత్తాన్ని 4000/- రూపాయలకు పెంచే అవకాశం ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.ఈ విషయం పై ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పెన్షన్లు రానివారు బాధపడకుండా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి తెలిపారు.తెలంగాణ కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన తాను ఏలాంటి ఇబ్బందులు ఉన్న ప్రజలు తన వద్దకు రావాలని కోరారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేసే మనిషినని తెలిపారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్లు పేదవారికి ఆర్థిక భరోసా , ఆత్మ గౌరవం అని అన్నారు.నల్గొండ కార్పొరేషన్ పరిధిలో కొత్త పెన్షన్లకు 2430 దరఖాస్తులు వస్తే 2036 దరఖాస్తులు అర్హత సాధించాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు .ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చేయూత పెన్షన్లను ఇస్తున్నదని, ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని,ఎన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు.మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల పెన్షన్లను ప్రభుత్వం ఇస్తున్నదని, దీని ద్వారా పేదలకు సామాజిక భద్రత కల్పించడం జరుగుతున్నదని ,ఈనెల 19 నుండి కొత్తగా మంజూరైన పెన్షన్లు లబ్ధిదారుల అకౌంట్లో జమవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ప్రతి పేదవాడికి మేలు కలగాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ప్రతినెల 197262 మంది కి పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతున్నదని, కొత్తగా 27,255 మందికి పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, నల్గొండ నియోజకవర్గంలో 4259 కొత్త పెన్షన్లు వచ్చాయని ,తెలిపారు.పెన్షన్ కోసం 5 కేటగిరిలలో కొత్త దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో వాటిని క్షున్నంగా పరిశీలించి అర్హులైన 27,255 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, నెలకు 2016 /- రూపాయల చొప్పున పెన్షన్ దారుల అకౌంట్లో పెన్షన్ డబ్బులు వేయడం జరుగుతుందని చెప్పారు . పెన్షన్ రానివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు . డిఆర్డిఓ శేఖర్ రెడ్డి మాట్లాడారు.అనంతరం మంత్రి లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఆఫీజ్ ఖాన్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కాళోజీ గొప్ప ప్రజా కవి, రక్తదానం ఒక మానవతా ఉద్యమం.

కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుపి.భవాని



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ప్రజల కష్టాలను, కన్నీళ్లను, ఆకాంక్షలను తన కవిత్వంలో ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని 'కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్' నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు పి.భవాని అన్నారు.కాళోజీ తన జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను, అక్రమాలను,సామాజిక అసమానతలను ప్రశ్నించారని పేర్కొన్నారు.తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కాళోజీ నారాయణరావు 24వ వర్ధంతి సందర్భంగా నవంబర్ 13న నల్లగొండ బార్ అసోసియేషన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు నల్లగొండ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.సతీష్ కుమార్, కార్యదర్శి బి.అశోక్ కుమార్ ప్రారంభించారు.కాళోజి అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు పి. భవాని మాట్లాడుతూ కాళోజీ కవిత్వం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదని,అది ప్రజల్లో చైతన్యాన్ని నింపిన సామాజిక ఉద్యమమని అన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం,మానవ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండటమే కాళోజీకి మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.కాళోజీ ఆశయాల్లో మానవత్వానికి అత్యంత ప్రాధాన్యత ఉందని,మనిషిని మనిషిగా గౌరవించడం,కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని భవాని పేర్కొన్నారు.ఈ స్ఫూర్తితోనే ఆయన వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.రక్తదానం అనేది మరొక మనిషికి ప్రాణం పోసే గొప్ప మానవతా కార్యక్రమమని అన్నారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాలు,ఇతర వైద్య అవసరాల్లో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు.ఆరోగ్యపరంగా అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రక్తదానం ద్వారా సమాజంలో సమానత్వం, సహకారం, సేవాభావం వంటి విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని, మహిళా న్యాయవాదులు న్యాయస్థానాల్లో న్యాయం కోసం పోరాడటమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమని అన్నారు.న్యాయవాద వృత్తి అనేది కేవలం వృత్తిపరమైన బాధ్యత మాత్రమే కాదని, సమాజం పట్ల బాధ్యతను కూడా కలిగి ఉంటుందని పేర్కొన్నారు.కాళోజీ వర్ధంతిని కేవలం స్మరణ కార్యక్రమంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.మాటలతో నివాళులు అర్పించడం కంటే చేతల్లో మానవత్వాన్ని చాటడం గొప్ప విషయమని అన్నారు.భవిష్యత్తులో కూడా కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక చైతన్యం,మానవతా విలువలు, ప్రజాసేవ లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పి.భవాని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పజ్జూరి స్వామి గౌడ్,నూకల సంధ్యారాణి, బార్ అసోసియేషన్ సభ్యులు పందుల సైదులు,నాంపల్లి భాగ్య, స్వామి దాస్,న్యాయవాదులు పి.శ్రీనివాస్ రెడ్డి, ఎం.వి. రాఘవరావు,ఎస్.శ్రీనివాస రెడ్డి, జె.లక్ష్మణ్, నాగిరెడ్డి, మామిడి ప్రమీల,పజూరి ఇందిర,తడకమల్ల వరుణ, దర్శనం ప్రియాంక, ముక్కెర శ్రీనివాస్,అంజనా యాదవ్, ఎం.నరేష్, సిహెచ్.సతీష్ కుమార్,మానుపాటి శ్రీకాంత్, పిట్ట సతీష్ అనేకమంది సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం సంతోషకరమని అన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చంద్రకుమార్ తెంబెళ్లి

చేయూత పెన్షన్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే: బీర్ల ఐలయ్య





యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి బొమ్మల రామారం నవంబర్ 12 (లోకల్ గైడ్) : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్ల పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...తెలంగాణలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. సమాజంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పేద కుటుంబాలకు చేయూత పెన్షన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రతి నెలా అందే పెన్షన్ తో వారి నిత్యావసర అవసరాలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు స్పష్టం చేశారు.

బాలల హక్కులు, బాలికల ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు



ఖమ్మం: లోకల్ గైడ్:బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాలికల ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస పాల్గొని విద్యార్థులకు బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నివారణ, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా బాలికలకు రుతుక్రమ సమయంలో ఎదురయ్యే సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే నాల్సా పక్షోత్సవ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు లోనుకాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించే స్టిక్కర్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

ట్రినిటీ పాఠశాల లో ఘనంగా బాలల దినోత్సవం



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 13 (లోకల్ గైడ్) : చౌటుప్పల్ పట్టణ కేంద్రం లోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటి జోన్ లో శుక్రవారం ముందస్తుగా బాలల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. బాల బాలికలు వివిధ వేషధారణలో వచ్చి పిల్లలందరినీ ఆనంద పరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరై పిల్లలకు నవంబర్ 14న భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా నెహ్రూ కు పిల్లలంటే అమితమైన ప్రేమ ఉంటుందని పిల్లలు ఎలా ఉండాలి? ఎలాంటి విషయాకానీ నేర్చుకోవాలి సమాజంలో మంచి చెడులను ఎలా గ్రహించా లో వివిధ సమస్యల గురించి ప్రిన్సిపాల్ పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు , ఐఐటి ఇంచార్జ్ అనుష, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ చందన, ఉపాధ్యాయులు జ్యోతి, శిరీష, ధనలక్ష్మి, హారిక, భార్గవి, లావణ్య సింధు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎంపిక



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్13 (లోకల్ గైడ్ న్యూస్) : హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న నందు ఈ నెల 2, 3 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, విద్యతోపాటు క్రీడారంగంలోనూ విద్యార్థులు ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన నందును అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ రాణించి కళాశాలకు, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కళాశాల అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్, ఫిజికల్ డైరెక్టర్ ఏటిబీటీ ప్రసాద్ తదితరులు పాల్గొని నందును అభినందించారు.

శ్రీదేవి సినిమా హాల్ ఎదుట మురుగునీటి సమస్య.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

రోడ్డుపై నిలిచిన మురుగునీటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం

వెంటనే శుభ్రం చేయాలని మిద్దెల మల్లారెడ్డి డిమాండ్

సైబరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్ కాలనీ రోడ్ నంబర్ 4లో శ్రీదేవి సినిమా హాల్ ఎదురుగా ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసే మిద్దెల మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై మురుగునీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. మురుగునీరు నిలిచిన ప్రాంతం గుండా నిత్యం వాహనదారులు, పాదచారులు, స్థానిక నివాసితులు రాకపోకలు సాగిస్తుంటారని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. నిలిచిన మురుగునీటి కారణంగా దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిశుభ్ర వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన ఇంతటి సమస్యపై సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది తక్షణమే స్పందించి శ్రీదేవి సినిమా హాల్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించి, పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా మురుగునీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తన పోరాటం కొనసాగుతుందని మిద్దెల మల్లారెడ్డి స్పష్టం చేశారు.

ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, సర్వీస్ సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు... అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్

ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్ షాప్ లో పాల్గొన్న అకౌంటెంట్ జనరల్



ఖమ్మం, నవంబర్ - 13: లోకల్ గైడ్ : ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, సర్వీస్ సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లాల వ్యాప్తంగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నావల్ కిషోర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత అంశాలపై ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నిర్వహించిన అదాలత్, వర్క్ షాప్ లో అకౌంటెంట్ జనరల్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్ మాట్లాడుతూ, ట్రెజరీ శాఖ ద్వారా అకౌంటెంట్ జనరల్ ఆఫీస్, ట్రెజరీల నుండి ఫైనాన్షియల్ అకౌంట్లు, ప్రొవిజన్ అకౌంట్లు, స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగుల జీపీఎఫ్, పెన్షన్ ఆమోదించబడతాయన్నారు. పెన్షన్ ఆమోదాలు డిస్చార్జ్ చేయాలంటే, రాష్ట్ర ప్రభుత్వం అందించే సమాచారం, రికార్డులు ముఖ్యమని తెలిపారు. అకౌంట్లు, పెన్షన్ ప్రపోజల్స్, జీపీఎఫ్ అప్లికేషన్స్‌కు సంబంధించిన అన్ని అంశాలు సంబంధిత డీడీవో ఆఫీసుల ద్వారా వస్తాయని తెలిపారు. పనిని బాగా, ఎఫిషియెంట్‌గా చేయడానికి, అకౌంట్స్‌లో అక్యూరసీ, కరెక్ట్‌నెస్ ఉండాలని తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత అప్లికేషన్స్ అన్నీ కరెక్ట్ ఫామ్‌లో, కరెక్ట్ టైమ్‌కి రావాలని, ఇది స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులు, డీడీవోలు చేయాలని అన్నారు . ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఇంటర్‌ప్రిటేషన్ అవసరమయ్యే రూల్స్ చాలా ఉంటాయని, వేర్వేరు ఆఫీసులు వాటిని వేర్వేరుగా ఇంటర్‌ప్రిట్ చేస్తుంటాయని తెలిపారు. వివిధ ఆఫీసుల నుండి వచ్చే వేర్వేరు ఇంటర్‌ప్రిటేషన్స్‌ను పరిశీలించి, ఏ ఇంటర్‌ప్రిటేషన్ తీసుకోవాలనే స్పష్టమైన డైరెక్షన్ ఇవ్వడానికి ఈ వర్క్‌షాప్ ప్రారంభించబడిందని వివరించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పెన్షనర్లకు మరింత మెరుగ్గా సహాయపడాలని, కొద్ది సంవత్సరాలలో అందరూ పెన్షనర్స్ అవుతారు కాబట్టి పెన్షనర్ల కోసం ఒక మంచి సిస్టమ్‌ను తయారు చేద్దామని సూచించారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరచడానికి, అక్కడ జరిగే చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దడానికి ట్రెజరీల తనిఖీ ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరిచేందుకు ఆడిట్, తనిఖీల పారాలను అందించి, వాటికి తగినట్లుగా స్పందిస్తే అకౌంట్లు మరింత మెరుగవుతాయని అన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు అన్నీ అడ్రస్ చేసి, వాటికి ఫైండ్ అవుట్ రెసల్యూషన్ అందించడం జరుగుతుందని అన్నారు. డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్, అందరు స్టేక్‌హోల్డర్స్ ఈ వర్క్‌షాప్ విజయవంతం కావడానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ శాఖల్లో సేవనందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల పూర్తి గౌరవంతో వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత అంశాలు సాధారణంగా కొద్దిగా సంక్లిష్టంగా ఉంటాయని, వాటిని సులభతరం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నిన్నటి వరకు పదవుల్లో ఉన్న అధికారులను ఎలాగైతే గౌరవించామో, రిటైర్మెంట్ తర్వాత కూడా అదే గౌరవాన్ని ఇస్తూ వారిని చిన్నచూపు చూడకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు. కనీసం 20 నుండి 30-40 సంవత్సరాలు సుదీర్ఘ సేవ చేసి రిటైర్ అయిన తర్వాత, ఏ చిన్న సమస్య ఎదురైనా వారు ఇబ్బంది పడకుండా చూడాలని, వారిని స్వయంగా ఆహ్వానించి గైడెన్స్ ఇవ్వడం ద్వారా ఎంతో సంతోషపడతారని తెలిపారు. తరచూ విడివిడిగా కరస్పాండెన్స్ చేయడం, మళ్లీ మళ్లీ ఆఫీసుల మట్టూ తిరగడం వంటి ఇబ్బందులను నివారించడానికి జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ప్రత్యేక వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా సమస్యలను అక్కడికక్కడే అర్థం చేసుకొని, అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపించడం వల్ల అధికారులకు, ఉద్యోగులకు కూడా సమయం ఆదా అవుతుందని అన్నారు . చాలా సందర్భాలలో బిల్లుల ఆమోదంలో వివిధ రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ వర్క్‌షాప్‌ల ద్వారా బిల్లుల ఆమోద ప్రక్రియపై కూడా స్పష్టత ఇస్తే పనులు సులభమవుతాయని తెలిపారు. పాలసీ సంబంధిత అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు, నిబంధనల ఇంటర్‌ప్రెటేషన్ సమస్యలను సరిగ్గా స్ట్రూటినైజ్ చేసుకోవడానికి ఈ వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, రేపు మనం కూడా రిటైర్ అయ్యాక ఇదే పరిస్థితి ఉంటుందని భావించి అధికారులందరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని కోరారు. డీడీఓ లు అందరూ ఈ వర్క్‌షాప్‌లకు పూర్తి శ్రద్ధ కనబరిచి, అన్ని విషయాలు అవగతం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ లు ఎం. నరేష్ కుమార్, కె. శశిధర్, ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ జె. మీనాక్షి, ఉభయ జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉప కోశాధికారులు మోదుగు వేలాద్రి, ప్రసన్న కుమార్, నాగేంద్ర కుమారి, శారదా, కృష్ణారావు, సారధి, సునీల్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సైదులు, రఫియా సుల్తానా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షులు డా.నరేష్ జాదవ్ ఆదేశాలతో గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి కార్యాచరణ

సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు గ్రామ, బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు -- తొడసం దౌలత్ రావులి

ప్రతి గ్రామంలో 21 మంది సభ్యులతో గ్రామ కమిటీ, ప్రతి బూత్‌లో 21 మంది సభ్యులతో బూత్ కమిటీ ఏర్పాటు

అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 13 : గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావు అధ్యక్షతన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ల ఆదేశాల మేరకు గుడిహత్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో 21 మంది సభ్యులతో గ్రామ కమిటీని, ప్రతి బూత్ స్థాయిలో 21 మంది సభ్యులతో బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లితొడసం దౌలత్ రావు గారు సమావేశంలో వెల్లడించారు.

ఈ సందర్భంగా తొడసం దౌలత్ రావు గారు మాట్లాడుతూ...

సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పటిష్టంగా నిర్మించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు, బూత్‌లలో ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా దాదాపు 1,400 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువవుతారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఈ కమిటీలు కీలక పాత్ర పోషించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కార దిశగా కృషి చేసేందుకు దోహదపడతాయని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి కమిటీ సభ్యుడు బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన సంస్థాగత పునాది ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ మండల ఉపధ్యక్షులు మారుతీ గారు,గర్కం పేట్ సర్పంచ్ కేశవ్ గారు,స్పోక్స్ పర్సన్ ఆడే జైపాల్ గారు, ప్రధాన కార్యదర్శి కాగ్నే రాంకిషన్,సెక్రటరీ రాథోడ్ రమేష్ గారు, విష్ణు పోలె గారు,కిషోర్ మదనే గారు, సారంగా పాణి గారు,సెడమాకి కృష్ణ గారూ, బాలవంత్ రావ్, మేశ్రం. మోహన్, వేలాది మాకేష్, సిదం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలకే పరిమితమైన పెద్దపల్లి అభివృద్ధి!

-బైపాస్ రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎప్పుడు పూర్తి చేస్తారు?

-హామీలు సరే.. అభివృద్ధి పనులేవీ? ఎమ్మెల్యేకు బీజేపీ నేత పల్లె సదానందం సూటి ప్రశ్న



పెద్దపల్లి, నవంబర్ 13 : (లోకల్ గైడ్) : పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో ఆర్భాటపు ప్రచారం, శిలాఫలకాల ఆవిష్కరణలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం తీవ్రస్థాయిలో విమర్శించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో పెద్దపల్లి నియోజకవర్గానికి సాధించిన అభివృద్ధి ఏమిటో ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల పేరుతో వందలాది శిలాఫలకాలు ఏర్పాటు చేయడం తప్ప, వాటిలో ఎన్ని పనులు పూర్తయ్యాయో చెప్పే పరిస్థితి లేదని విమర్శించారు. ముఖ్యంగా పెద్దపల్లి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గతంలో పెద్ద కల్వాల నుంచి అప్పన్నపేట వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడతామంటూ పెద్ద ఎత్తున హడావుడి చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారని, ఆ తర్వాత భూసేకరణ, రైతులకు నష్టపరిహారం చెల్లింపు వంటి కీలక అంశాలను పట్టించుకోకుండా పనులను అర్ధంతరంగా వదిలేశారని ఆరోపించారు. సుజల స్రవంతి పథకం పేరుతో కొంతమేర మట్టి పోసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. శిలాఫలకాలపై చూపిస్తున్న శ్రద్ధను పనుల పూర్తి చేయడంపై చూపించాలని హితవు పలికారు. పెద్దపల్లి జూనియర్ కళాశాల అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగపడాల్సిన సదుపాయాలు అందుబాటులో లేకుండా పోయాయని అన్నారు. పట్టణంలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ సైతం నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను దెబ్బతీయడం ఏమిటని ప్రశ్నించారు. పెద్దపల్లి ప్రధాన బజార్ రహదారి పనుల విషయంలో వ్యాపారులను బెదిరించడం, కొందరిపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. పండుగల సీజన్‌లో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అభివృద్ధి పేరుతో చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదని పేర్కొన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన పెద్దపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపుగా ఉన్న కమాన్ చౌరస్తా రూపురేఖలను రాత్రికి రాత్రే మార్చే ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పట్టణ చారిత్రక ఆనవాళ్లను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని, స్థానికుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పదవీకాలంలో మూడేళ్లు గడిచినా పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రజలకు చూపించదగిన అభివృద్ధి పనులు ఏమి చేపట్టారో స్పష్టం చేయాలని పల్లె సదానందం సవాల్ విసిరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని విమర్శించారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు అందాల్సి ఉండగా, ఆర్థికంగా స్థితిమంతులైన వారికి ఇళ్లు కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరాంపూర్ మండలంలో అర్హులైన పేదలకు ఇప్పటివరకు ఇళ్లు అందకపోవడం బాధాకరమన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ పనులు ముందుకు సాగలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బైపాస్ రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటం పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. పెద్దపల్లి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని పల్లె సదానందం హెచ్చరించారు. పెండింగ్ అభివృద్ధి పనుల సాధన కోసం బీజేపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ బాలసాని శ్రీనివాస్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఛాతరాజు రమేష్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర మనోహర్, నాయకులు జిట్టే రాజు, బండి కరుణాకర్, మంథని కృష్ణ, ముత్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బాలకృష్ణ తెండెక్కి

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉందాం.

తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్



ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నూతన పింఛన్లను అందజేసి లబ్ధిదారులకు అండగా నిలిచారని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.శాలిగౌరారం మండల వ్యాప్తంగా నూతనంగా 1016 మందికి పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వం చేయని అనేక అభివృద్ధి సంక్షేమని చేస్తున్నారని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నూతన పింఛన్ల రేషన్ కార్డులు ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని తెలిపారు. మరోసారి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు.

యువత మద్దతుతో ఎమ్మెల్సీగా గెలుస్తా... సామాజిక తెలంగాణ కు బీజం పోస్తా

టి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్



నారాయణపేట నవంబర్ 13: సామాజిక తెలంగాణ ను కాంగ్రెస్,బి ఆర్ ఎస్ పార్టీలు మరిచిపోయారని టి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు అన్నారు.సామాజిక తెలంగాణ ను బతికించడం కోసమే పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సారథ్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో టి ఆర్ ఎస్ పార్టీ ఇద్దరు బడుగు బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను అధినేత్రి కవిత ప్రకటించారని అన్నారు.శుక్రవారం నారాయణపేట లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు పట్టణంలో జిల్లా టి ఆర్ ఆధ్యక్షుడు గవినొళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు,డాక్టర్ల తో సమావేశమై మద్దతు కోరారు.అంతకు ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తను ఒక జర్నలిస్టును ఆర్థికంగా లేని వాడినని తెలిపారు.అయితే తనకు పాలమూరు,రంగారెడ్డి,హైద్రాబాద్ ఎమ్మెల్సీ గా ఓటు ఎందుకు వేయాలో వివరించారు.రాష్ట్రంలో పదేళ్లు ప్రభుత్వం నడిపిన బి ఆర్ ఎస్,ప్రస్తుతం అధి కారంలో ఉన్న కాంగ్రెస్ హామీలను విష్మరించా యని విమర్శించారు. దేని కోసం అయితే తెలంగాణ సాధించుకున్నమో అధి నెరవేరలేదు అన్నారు.నిధులు నియామకాలు,సామాజిక న్యాయం అడ్రస్ లేకుండా పోయాయని అన్నారు.వాటిని సాధించడం కోసమే టి ఆర్ ఎస్ ఆవిర్భవించిందని తెలిపారు.అయితే వివిధ పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు ధారపోసి గెలువాలని చూస్తున్నాయని అన్నారు.కానీ ఒక విద్యావేత్తగా,జర్నలిస్టుగా యువకుడిగా ఎమ్మెల్సీగ పోటీ చేస్తున్నానని చెప్పారు.జెన్ జీ పోరాటం ఒక్క ఉద్యమాలకు పరిమితం కారాదని అన్నారు.యువత తలుచుకుంటే ఫలితాలు తారుమారు అవుతాయన్నారు.అదే లక్ష్యంతో పోటీలో ఉన్నానని తనకు మద్దతు ఇచ్చి గెలిపిస్తే మండలిలో యువత తరపున పోరాటం చేస్తానని అన్నారు.అందరూ ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో టి ఆర్ ఎస్ రాష్ట్ర,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లయన్స్ క్లబ్ నిత్య 'అన్నదానం'



నారాయణపేట నవంబర్ 13 : మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయ న్స్ క్లబ్ ఆఫ్ నారాయణ పేట ఆధ్వ ర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానము కార్యక్రమ ములో భాగంగా శుక్రవారం నాటికి 135వరోజులకు చేరింది. అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్ విజయ్ పల్లర్ల స్పాన్సర్ చేశారు. అన్నదాన కార్యక్రమం వివేకానంద పార్క్ వద్ద నిర్వహించా రు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ మాట్లాడు తూ సమా జంలో అవసర మైన వారికి అండగా నిల వడం, సామా జిక బాధ్యత గా భావి స్తూ,లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్య క్రమాలు కొన సాగిస్తున్నామని తెలి పారు.ఈ కార్యక్ర మంలో యులయన్స్ సరిత బట్టాడ్ , శ్రీనివాస్ లాహోటి, కన్నా జగదీష్, పుత్నాక్ రమేష్, డాక్టర్ సచిన్ , కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన సర్పంచ్ సతీష్ రెడ్డి

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలి -- సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ రెడ్డి



ఓదెల మండలం,నవంబర్, 13: (లోకల్ గైడ్) : గ్రామంలో పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్, ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ కలిసి వెళ్లారు. విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాలు, గుడ్లు, ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించే ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్య ద్వారానే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్య లేని వాడు వింత పశువు అనే సామెతను గుర్తు చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ విద్యార్థుల హాజరుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లల చదువుపట్ల బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఈ నెల 16న బాలల ప్రజావాణి కార్యక్రమం

నారాయణపేట నవంబర్ 13 : నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 16వ తేదీ బాలల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ , ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సర్వే) ఒక ప్రకటనలో తెలిపారు.బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించేందు కు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు.ఈ కార్యక్రమంలో బాలలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, పోషకా హారం, సంరక్షణ, భద్రత, బాలల హక్కులు, బాలల అభివృద్ధి తదితర అంశాల పై వచ్చే సమస్యలను స్వీక రించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.బాలల సమస్య లను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛం ద సంస్థల ప్రతినిధులు తమ సమస్యలు, సూచన లతో కార్యక్రమంలో పాల్గొ నాలని కోరారు.బాలల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించా లని జిల్లా సంక్షేమ అధికారి విజ్ఞప్తి చేశారు.

నేటి బాలలే దేశ భవిష్యత్తు - బాలల భద్రతే మన బాధ్యత....

సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



నారాయణపేట నవంబర్ 13: నేటి బాలలే రేపటి పౌరులు అని వారి భద్రతే మన బాధ్యత అని నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అన్నారు.బాలల దినోత్స వం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, నారాయణపేటఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్ లో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమా నికి జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి, సీని యర్ సివిల్ జడ్జి శ్రీమతి వింధ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలల దినోత్సవం ఉద్దేశ్యా న్ని వివరిస్తూ, దేశ ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం జరుపుకుంటారని తెలిపా రు. పిల్లల హక్కులు, వారి భద్రత, విద్య మరియు సంక్షేమం గురించి సమా జంలో అవగాహన కల్పించ డమే ఈ దినోత్సవంయొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపా రు. ఈ సంవత్సరం నవంబ ర్ 14వ తేదీ రెండవ శనివా రం సెలవు దినం కావడం తో, నవంబర్ 13వ తేదీనే బాలల దినోత్సవ కార్య క్రమం నిర్వహించబడిందని తెలిపారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి బిడ్డకు చదువుకునే హక్కు ఉందని తెలిపారు. పిల్లల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పోక్సో చట్టం గురించి వివరిం చారు. ఎవరైనా చెడుగా తాకినా, భయపెట్టినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు చెప్పాలని సూచించారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు తెలుపుతూ కంప్యూటర్ పరిజ్ఞానం – నేటి తరం అవసరం: నేటి వేగవంతమైన తరంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకుండా ముందుకు వెళ్లడం సాధ్యం కాదు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం – ఏ రంగంలో చూసినా కంప్యూటర్ తప్పనిసరి అయిపో యిందన్నారు. పిల్లలు చిన్న వయసు నుండే కంప్యూ టర్ నేర్చుకుంటే, వారికి ప్రపంచ జ్ఞానం అందుబాటు లోకి వస్తుందన్నారు. ఇంటర్నెట్ ను మంచి కోసం, చదువు కోసం వాడుకోవాలి తప్ప, చెడు వీడియోలు, గేమ్స్ కోసం వాడకూడదని, కంప్యూటర్ నేర్చుకున్న పిల్లలే రేపటి భవిష్యత్తును నిర్మించ గలరని అవగాహన కల్పిం చారు.చైల్డ్ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ నర్సిములు మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ నేరం అని, 14 సంవత్సరాల లోపు పిల్లల తో పని చేయించడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేయవద్దని, పిల్లలకు ఏదైనా సమస్య వస్తే చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కు కాల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ కె. లక్ష్మిపతి గౌడ్,సీనియర్ న్యాయవాది నందు నామాజీ పాఠశాల, చైల్డ్ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ నర్సిములు, పోలీస్ అధికారి కృష్ణయ్య గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఇమ్రాన్ పాష మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలలు భారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సాధనకు కృషి చేయాలి

ప్రపంచ బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక.




నారాయణపేట నవంబర్ 13 : బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలవ ర్షాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని తెలిపారు. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల ప్రతిభను ప్రోత్సహిం చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద కలలు కనాలని, భవిష్యత్తులో తాము ఏ స్థాయికి చేరుకోవాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. రాకెట్ సైంటిస్టులు, జిల్లా కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, గొప్ప పరిశ్రామికవేత్తలు కావాలనే ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయాల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయాలను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. అదేవిధంగా కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులలోని భిన్నత్వాన్ని గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, తోటి విద్యార్థులను వేధించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో అనవసరమైన రీల్స్, సోషల్ మీడియా, గేమ్స్‌కు ఎక్కువ సమయం కేటాయించకుండా, విజ్ఞానాన్ని పెంపొందించే సైన్స్, గణితం, విద్యా సంబంధిత వీడియోలను వీక్షించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం వల్ల ఆలోచనా పరిధి, సృజనాత్మకత, జ్ఞానం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏ ఎం వో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ వో కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత పెద్దపల్లి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పెద్దపెల్లి,నవంబర్,13: (లోకల్ గైడ్) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ పోలీసుల ఆధ్వర్యంలో, పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్స్‌లో నిషా ముక్త్ భారత్, ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ..., పోలీస్ శాఖ సూచనలు, విజ్ఞప్తులను శ్రద్ధగా ఆలకించేందుకు కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ ముందుగా ధన్యవాదాలు తెలిపారు.ప్రిన్సిపాల్ తమ వ్యక్తిగత జీవిత అనుభవాలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం అందించడం అభినందనీయమని అన్నారు.సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నవారు, సమాజంపై ప్రభావం చూపగలిగిన వ్యక్తులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు విద్యార్థులకు రోల్ మోడల్స్‌గా నిలిచి వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమేనని తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డీసీపీలు,ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు,ఇతర పోలీసు సిబ్బంది నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మహారాష్ట్ర ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు రైల్వే స్టేషన్ ద్వారా వచ్చి యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వినియోగం వైపు ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా అమాయకులైన కొంతమంది యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని, అందువల్ల ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



తల్లిదండ్రులకు తన ప్రత్యేక విజ్ఞప్తి ఏమిటంటే,తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు,ఎవరితో కలిసి ఉంటున్నారు, వారి స్నేహితులు ఎవరు, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే విషయాలను నిరంతరం గమనించాలని సూచించారు. పిల్లలు కోపగించుకున్నా సరే,వారి భవిష్యత్తు దృష్ట్యా వారిని ప్రశ్నించాలని అన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ,ప్రేమతో కూడిన మందలింపు పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రహరీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఈ కమిటీల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించడంతో పాటు,విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ ఈ సమస్యను సమిష్టిగా నియంత్రించాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసులతో పాటు విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను నేరస్థులుగా చూడకుండా,వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేలా చేయడానికి కూడా మనమంతా కృషి చేయాలని సీపీ అన్నారు.వారు మారాలని, మంచి జీవితాన్ని గడపాలని ఆసక్తి చూపితే పోలీస్ శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సింగరేణి మెడికల్ కాలేజీలో డీ-అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని,మత్తు పదార్థాలకు బానిసైన వారికి వైద్యుల పర్యవేక్షణలో వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించి వ్యసనం నుంచి బయటపడేందుకు సహకరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికే పలువురు ఈ కేంద్రం ద్వారా చికిత్స పొందుతూ వ్యసనాలకు దూరమై సమాజంలో మంచి జీవితాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు.కాబట్టి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి అవసరమైన చికిత్స అందించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరపున తమ విజ్ఞప్తి ఒక్కటేనని సీపీ అన్నారు.ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే అలవాటు పడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చికిత్స పొందాలని కోరారు. అదే సమయంలో మాదకద్రవ్యాల సరఫరా,విక్రయాలు, వినియోగాన్ని ప్రోత్సహించడం లేదా ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత భవిష్యత్తును కాపాడటం మనందరి బాధ్యత అని అన్నారు. పోలీస్ శాఖకు ప్రజలు సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలని సీపీ అంబర్ కిషోర్ ఝా కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు,ఎస్ఐ రాజశేఖర్,రూరల్ ఎస్ఐ మధుకర్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

మాజీ ఎమ్మెల్యే ను కలిసిన బి ఆర్ఎస్ నేతలు



నారాయణపేట నవంబర్ 13:నారా యణపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కార్తీక మాసం లో చేపట్టే పూజా కార్యక్రమానికి నారాయణపేట కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాజీ మార్కెట్ వైర్మన్ మాజీ కౌన్సిలర్ జ్యోతి లు శుక్రవారం రైచూర్ లోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో చేపట్టిన పూజా కార్యక్రమా నికి హాజరయ్యారు. కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే మాజీ ఎమ్మె ల్యే రాజేందర్రెడ్డి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున పూజ నిర్వహించ డంతో ఆ పూజా కార్యక్ర మానికి బి ఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు ప్రజాప్ర తినిధులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు పూజ అనంత రం అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు

సామ రూపేష్ రెడ్డి ఇంటికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా....



అదిలాబాద్ లోకల్ గైడ్ నవంబర్ 13 : ఆత్మీయ తేనీటి విందు ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సాంగిడి గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ సామ రూపేష్ రెడ్డి నివాసానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా విచ్చేశారు.ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి కుటుంబ సభ్యులు కలెక్టర్కు ఆత్మీయ స్వాగతం పలికారు.అనంతరం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగారు.జిల్లా కలెక్టర్ తమ ఇంటికి విచ్చేసి ఆత్మీయ సమయం గడపడం పట్ల సామ రూపేష్ రెడ్డి,కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ఐపీఎస్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణ ప్రియా

బాలలే రేపటి సమాజ నిర్మాతలు

ఆటపాటలతో అలరించిన చిన్నారులు





పెద్దపల్లి జిల్లా నవంబర్ 13 (లోకల్ గైడ్) : బాలలే రేపటి సమాజ నిర్మాతలని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ అన్నారు. పట్టణంలోని స్వప్న కాలనీలో గల ఇండియన్ పబ్లిక్ పాఠశాల లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలు, రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ బాలలే దేశానికి విలువైన సంపద అని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటాయని, వాటిని గుర్తించిప్రోత్సహించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, వివిధ కార్యక్రమాలతో సందడి చేశారు. రంగురంగుల రంగవల్లులు వేస్తూ తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల కేరింతలు, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల ఆనందోత్సాహాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు..

యాదవ కమ్యూనిటీ హల్ భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రభుత్వ విప్ విజయరమణ రావు





పెద్దపల్లి జిల్లా నవంబర్ 13 (లోకల్ గైడ్) : సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో 07వ వార్డులో యాదవ కమ్యూనిటీ హల్ భవన నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులతో స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినపల ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, చింతల రాజు, ఊట్ల వరప్రసాద్, గాదాసి మంజుల రవీందర్, ప్రజాప్రతినిధులు, యాదవ సోదరులు, కాంగ్రెస్ నాయకులు, తిరుపతి, శ్రీనివాస్, కార్యకర్తలు, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజేంద్ర నగర్ లో పలువురు బిఆర్ఎస్ చేరిక.



రాజేంద్ర నగర్, (లోకల్ గైడ్) : అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణలో నూకల చెల్లా యని బిఆర్ఎస్ రాజేంద్ర నగర్ సర్కిల్ ఇంచార్జి పోరెడ్డి ధర్మా రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డితన హామీలను తుంగలో తొక్కారాని ఆరోపించారు. శనివారం మాజీ మాత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ కు చెందిన మంగళారం కార్తీక్ తన మిత్ర బృందం, వివిధ కాలనీలకు చెందిన సుమారు 150 మంది కార్యకర్తలు బి ఆర్ ఎస్ లో చేరనున్నట్లు పోరెడ్డి ధర్మారెడ్డి తెలిపారు. అదే విధంగా మహిళలు, యువకులు పార్టీలో చేరానున్నట్లు తెలిపారు. రాజేంద్ర నగర్ లోని అంబేద్కర్ చౌరస్తా లో జరిగే ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి...

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు సన్న వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి

యంగ్ ఇండియా పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను గడువులోగా పూర్తి చేయాలి

వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్య, భూసేకరణ, వీబీ జీ రామ్ జీ, వీధి కుక్కల నియంత్రణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్





ఖమ్మం, నవంబర్ -13: లోకల్ గైడ్ బ్యూరో : రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును నివారించి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిఎస్ కలెక్టర్లకు ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీ జీ రామ్ జీ, పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ పలు అంశాలను సమీక్షించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని, సూక్ష్మ సేద్య విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం జరగకూడదనీ, ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ సన్న వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులందరి వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించార విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యా మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలి రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 8 పనులు పూర్తయ్యాయని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని సీఎస్ తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ. 625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో జాప్యం ఉండకూడదని, ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలి ఎంపీడీఓ రత్నాకర్ రావు

అదిలాబాద్ లోకల్ గైడ్ సోనాల మండలం, నవంబర్ 13 : భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సోనాల మండల ఎంపీడీఓ రత్నాకర్ రావు సూచించారు. గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు సాకెర గ్రామపంచాయతీ పరిధిలోని సూర్యనగర్ గ్రామంలో ఎంపీడీఓ రత్నాకర్ రావు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఇంటి పరిసరాల్లో పడే వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడం వల్ల భూగర్భ జలమట్టం పెరుగుతుందని తెలిపారు.

ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలు:

వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా భూమిలోకి ఇంకుతుంది. భూగర్భ జలమట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. వేసవికాలంలో నీటి ఎద్దడి సమస్యను కొంతవరకు తగ్గించవచ్చు. భూమిలో తేమ శాతం పెరిగి మొక్కలు, చెట్ల పెరుగుదలకు ఉపయోగపడుతుంది. వర్షాకాలంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం, నీటి ప్రవాహం వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయి. భూమిలో సహజంగా నీటి నిల్వలు పెరగడానికి తోడ్పడుతుంది. భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ప్రతి ఇంటి వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామ స్థాయిలో నీటి సంరక్షణ సాధ్యమవుతుంది. అంతేకాకుండా, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకునే వారికి ఉపాధి హామీ పథకం (ఎడీ-+ ూవీ +) ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన ఆర్థిక సహాయం కూడా అందిస్తామని గ్రామస్తులకు తెలియజేశారు. నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నేటి నీటి పొదుపే రేపటి నీటి భద్రతకు పునాది అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం జరిగేలా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎంపీడీఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, గ్రామపంచాయతీ కార్యదర్శి మిథున్ చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ దన్ రాజ్, సీనియర్ మేట్ మనాల శేఖర్ , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

దూళికట్టలో ఘనంగా నూతన 'చేయూత' పింఛన్ల పంపిణీ

పెద్దపల్లి నియోజకవర్గానికి 5,124 నూతన పింఛన్లు మంజూరు

నవంబర్ 19న (ఇందిరా గాంధీ జయంతి) లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

జిల్లాలోనే సింహభాగం పెద్దపల్లికే

రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు





పెద్దపల్లి జిల్లా నవంబర్ 13 (లోకల్ గైడ్) : ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఎలిగేడు జూలపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు "నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ" కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఎలిగేడు మండలానికి చెందిన 398 నూతన పెన్షన్ లబ్ధిదారులకు,జూలపల్లి మండలానికి చెందిన 406 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో అందజేసిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ?ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూరాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, చేనేత-గీత తదితర వృత్తిదారుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో పింఛన్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షించి ఇబ్బందులు పడ్డ అక్కాచెల్లెళ్లకు, సోదరులకు ఈరోజు ఊరట కలిగిస్తూ పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 5,124 మందికి నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.?జిల్లాలోనే సింహభాగం పెద్దపల్లికే?పింఛన్ల పంపిణీ వివరాలను వెల్లడిస్తూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా దాదాపు 11,000 పైచిలుకు నూతన పింఛన్లు రాగా, అందులో ఏకంగా 48 శాతం (5,124 పింఛన్లు) ఒక్క పెద్దపల్లి నియోజకవర్గానికే దక్కడం విశేషమన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి అర్హులైన పేదలకు న్యాయం చేయగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు.?తిరస్కరణకు గురైన వారికి తీపి కబురు నియోజకవర్గం నుంచి దాదాపు 6,000 పైచిలుకు దరఖాస్తులు రాగా, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శుల పరిశీలన అనంతరం థర్డ్ పార్టీ ఎంక్వైరీ ద్వారా 1,300 నుంచి 1,400 (దాదాపు 10-15%) దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయని వివరించారు. కారు ఉండటం, రైస్ మిల్లులు ఉండటం, 8-10 ఎకరాల భూమి ఉండటం లేదా కుటుంబంలో నౌకరీ ఉండటం వంటి కారణాల వల్ల ఇవి తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. అయితే, అర్హత ఉండి కూడా కేవలం 2 నుండి 3 శాతం మందికి చిన్న చిన్న సాంకేతిక కారణాలతో పింఛన్లు రాకుండా పోయాయని, అటువంటి వారిని ఏమాత్రం ఆందోళన చెందవద్దని కోరారు. "మీ బిడ్డగా, మీ ఎమ్మెల్యేగా 100% పర్యవేక్షణ చేసి, రీ-సర్వే ద్వారా ఆ లోపాలను సరిదిద్ది భవిష్యత్తులో పింఛన్ ఇప్పించే పూర్తి బాధ్యత నాదే" అని పునరుద్ఘాటించారు. మంజూరు ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులందరికీ రాబోయే నవంబర్ 19న (మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి) సాయంత్రం లోపు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ అవుతుందని స్పష్టం చేశారు.?గ్రామాల్లో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు రాబోయే ఏప్రిల్ నెల నుంచి కొత్త ప్రక్రియ ప్రారంభించి, 3-4 నెలల వ్యవధిలో ప్రతి గ్రామంలో నూటికి నూరు శాతం అర్హులకు పింఛన్లు అందిస్తామని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేసిన అనంతరం, ప్రస్తుతం ఇస్తున్న రూ. 2,000 పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం భవిష్యత్తులో మరింత పెంచి ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.?ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భేష్:నియోజకవర్గానికి మొదటి విడతలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇండ్లలో (రూ. 5 లక్షల ఆర్థిక సాయం) దాదాపు 2,700 మంది పేద ప్రజలు ఇప్పటికే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకుంటున్నారని, ఇచ్చిన మాట ప్రకారం పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని చెప్పారు.?ఈ కార్యక్రమంలో డి ర్ డి ఓ, ఎలిగేడు, జూలపల్లి మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి పరిశీలన

-200 అడుగుల రహదారి వెడల్పును 160 అడుగులకు తగ్గించే అంశంపై చర్చ

-నవంబర్ 15లోగా ప్రభావిత ఆస్తుల యజమానులకు నోటీసులు

-జారీ చేయాలని.. కమిషనర్ ఆదేశం





సైబరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా చేపట్టనున్న హెచ్- సిటీ ప్రాజెక్టు పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రతిపాదిత గ్రేడ్ సెపరేటర్ నిర్మాణ పనులను శుక్రవారం సీఎంసీ కమిషనర్ సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్విన్ ఎక్స్ రోడ్స్ నుంచి హఫీజ్‌పేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) వరకు ప్రతిపాదించిన 200 అడుగుల రహదారి నిర్మాణానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ప్రతిపాదిత రహదారి నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులను గుర్తించి, రహదారి వెడల్పును 200 అడుగుల నుంచి 160 అడుగులకు తగ్గించే సాధ్యాసాధ్యాల పై ఎమ్మెల్యే, అధికారుల తో కమిషనర్ చర్చించారు. సవరించిన రహదారి అలైన్‌మెంట్‌కు అనుగుణంగా టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సర్వేలో గుర్తించిన ప్రభావిత ఆస్తుల యజమానులకు నవంబర్ 15, 2026లోగా నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతిపాదిత మౌలిక సదుపాయాల పనుల్లో భాగంగా వెహిక్యులర్ అండర్‌పాస్ (వియుపి) వరకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన సర్వేలు, భూసేకరణ, ఇతర పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు హెచ్- సిటీ ప్రాజెక్టు పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

పసి హృదయాల పాలిట పెద్ద మనసు చాటుకున్న శీనన్న!

తలసేమియా బాధిత చిన్నారులకు చేయూత పింఛన్ల మంజూరు

మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు



ఖమ్మం: లోకల్ గైడ్ బ్యూరో : తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకున్న చొరవపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేయించడంతో తమకు ఎంతో ఊరట లభించిందని పేర్కొంటూ శుక్రవారం పలువురు తలసేమియా బాధితులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడే తలసేమియా బాధితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన పొంగులేటి.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కూడా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తుచేశారు. ఆయన చొరవతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని సుమారు 150 మంది చిన్నారులతో పాటు జిల్లాలోని వందలాది మంది బాధితులకు పింఛన్లు మంజూరు కానుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి ఆర్థికంగా అండగా నిలిచిన శీనన్నకు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, సంస్థ ఉపాధ్యక్షురాలు పొద్దుటూరి పావని, సభ్యులు అనిత, ఉదయ భాస్కర్ తదితరులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల భవన నిర్మాణానికి భూమిపూజ



కామారెడ్డి జిల్లా (లోకల్ గైడ్) : కామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో శుక్రవారం రోజున బండ కింది మానస రమేష్, మేడిపల్లి లావణ్య బాల్ సాయిలు ఇందిరమ్మ ఇండ్ల కు భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మనీషా రామస్వామి ఆధ్వర్యంలో భూమి పూజ చేసి , ముగ్గు పోశారు, అనంతరం ఆర్డర్ కాపీ అందజేశారు, లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల రాజు, వార్డ్ మెంబర్ దుంపాల సుప్రియ, వడ్ల లింగమాచారి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెండేలా నర్సారెడ్డి, దుంపల బాలరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కుటుంబాలకు జనరేటర్ల పంపిణీ

ఎమ్మెల్యే కోరం కనకయ్య

సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ





లోకల్ గైడ్, బయ్యారం, నవంబర్ 12 : బయ్యారం మండలం జగ్గుతండా గ్రామపంచాయతీకి చెందిన మసీద్ బజార్ వాసులకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా జనరేటర్లు మంజూరయ్యాయి. మంజూరైన జనరేటర్లను నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య మరియు గ్రామ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా మైనారిటీ శాఖ ద్వారా నిరుపేద కుటుంబాలకు జనరేటర్లు మంజూరు కావడం ఎంతో సంతోషమని, స్వయంకృషితో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి, ప్రభుత్వ అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించిన.. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్

వ్యర్థాల సేకరణ, రవాణా సామర్థ్యాన్ని పెంచాలి.. అక్రమ పారవేతను

అరికట్టి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



సైబరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో వివిధ అభివృద్ధి పనుల ద్వారా ఉత్పత్తి అవుతున్న నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ వేస్ట్) నిబంధనల ప్రకారం సేకరించడం, రవాణా చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేసి పారవేయడంపై శుక్రవారం సీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని విభాగాల అధిపతులు, సంబంధిత కాంట్రాక్టర్లు, రాయితీదారు సంస్థ హెచ్‌సీడీబ్ల్యూఎంపీఎల్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను నిర్దేశిత నిబంధనల ప్రకారం క్రమబద్ధంగా సేకరించడం, తరలించడం, ప్రాసెసింగ్ చేయడం, శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ క్రమంలో వ్యర్థాల సేకరణ, తరలింపు, పారవేత సమయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులను కాంట్రాక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ వ్యర్థాల సేకరణ సామర్థ్యాన్ని మరింత పెంచడంతో పాటు రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని రాయితీదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించి వ్యర్థాల సేకరణ సజావుగా, సకాలంలో జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల సేకరణ, రవాణా, శాస్త్రీయ పద్ధతిలో పారవేతతో పాటు పునర్వినియోగం చేసే ప్రక్రియలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంబంధిత అన్ని విభాగాలు, కాంట్రాక్టర్లు, రాయితీదారు సంస్థ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ అక్రమంగా పారవేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నగర పరిశుభ్రతను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. సీఎంసీ పరిధిలో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేసి సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పోచంపల్లి టూరిజం పార్క్‌ను సందర్శించిన జె.ఎన్.ఏ.ఎఫ్.ఏ.యు విద్యార్థులు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి పోచంపల్లి నవంబర్ 13 (లోకల్ గైడ్) : హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం పోచంపల్లి టూరిజం పార్క్ ను సందర్శించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ చేనేత, పార్క్ అందాలు, టూరిజం అభివృద్ధి గురించి విద్యార్థులు తెలుసుకున్నారు.

హోంగార్డుల సంక్షేమం కోసం పోలీస్ శాఖ ఎల్లవేళలా కృషి .

హోంగార్డులకు వైద్య సహాయం, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.3,43,000 చెక్కుల పంపిణీ.

జిల్లా ఎస్ . పి . శరత్ చంద్ర పవార్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ : హోంగార్డుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. విధి నిర్వహణలో పోలీస్ శాఖకు వెన్నెముకగా నిలుస్తూ తమ సేవలను అందిస్తున్న హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ద్వారా అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (హోంగార్డ్స్), హైదరాబాద్ వారి ఆమోదంతో సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన మొత్తం రూ.3,43,000/-లను నల్గొండ జిల్లాకు చెందిన 10 మంది హోంగార్డులకు వివిధ సంక్షేమ ప్రయోజనాల కింద మంజూరు చేయడం జరిగింది. ఇందులో భాగంగా వైద్య చికిత్స నిమిత్తం ఇద్దరు హోంగార్డులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.20,000, మెరిట్ స్కాలర్‌షిప్ కింద ఇద్దరు హోంగార్డుల పిల్లలకు రూ.1,000 మరియు రూ.2,000 చొప్పున మొత్తం రూ.3,000, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు డెత్ బెనిఫిట్ కింద నలుగురికి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున మొత్తం రూ.60,000, పదవీ విరమణ చేసిన ఇద్దరు హోంగార్డులకు ఒక్కొక్కరికి రూ.1,30,000 చొప్పున మొత్తం రూ.2,60,000 మంజూరు చేయడం జరిగింది.ఈ ఆర్థిక సహాయం పొందిన వారిలో హెచ్‌జీ నంబర్ 407 ఎం. సుగుణమ్మ, హెచ్‌జీ నంబర్ 611 ఆర్. మోహన్‌లకు వైద్య సహాయం, హెచ్‌జీ నంబర్ 463 ఎం.డి. జుబేర్ పాషా, హెచ్‌జీ నంబర్ 211 ఎల్. ఆంజనేయ చారికి మెరిట్ స్కాలర్‌షిప్, హెచ్‌జీ నంబర్ 482 మా. షౌకత్ అలీ, హెచ్‌జీ నంబర్ 195 కె. నాగేందర్, హెచ్‌జీ నంబర్ 126 వి. వెంకటేశ్వర్లుకు, హెచ్‌జీ నంబర్ 42 ఎస్‌కే. లతీఫ్‌ల కుటుంబాలకు మరణ ప్రయోజనం కింద ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా హెచ్‌జీ నంబర్ 589 శ్రీ పి. వెంకట చారి, హెచ్‌జీ నంబర్ 1067..... పి. మహాలక్ష్మిలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద ఆర్థిక సహాయం మంజూరు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీస్ శాఖలో భాగస్వాములుగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర విధుల్లో నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి, ఆపద సమయంలో వారికి మరియు వారి కుటుంబాలకు అండగా నిలవడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.హోంగార్డుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన వారికి సకాలంలో అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.హోంగార్డులు తమ విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ కళ్యాణ్ రాజ్ తదితరులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన

వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్



కామారెడ్డి జిల్లా (లోకల్ గైడ్) : రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి, రామారెడ్డి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ మినుకుల పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా రైతులకు ధాన్యం నాణ్యత ప్రమాణాలపై పలు సూచనలు చేయడం జరిగింది. రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 17 శాతానికి మించకుండా చూసుకోవాలని సూచించను.అదేవిధంగా ధాన్యాన్ని జల్లెడ పట్టి తాలు, మట్టి, రాళ్లు , ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పాటించి రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు రాజు, శ్రీనివాస్ , రైతులు గంగరాజు, రాజారాం, శంకరయ్య, రాజయ్య, భైరయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండ్రాతిమడుగులో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా



లోకల్ గైడ్, నవంబర్ 14 : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామంలో బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఒక్కరోజు అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థి బన్నీ జిల్లా విద్యాశాఖాధికారిగా, విద్యార్థి . విష్ణు ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించి పాఠశాల పరిపాలన, తరగతుల నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జానయ్య మాట్లాడుతూ భారత తొలి ప్రధానమంత్రి చాచా నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, పిల్లల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే స్వయం పరిపాలన దినోత్సవం ముఖ్య ఉద్దేశమని, ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు చిన్న వయసు నుండే పరిపాలన వ్యవస్థపై అవగాహన పెంచుకుంటారని అన్నారు. పాఠశాల నిర్వహణలో విద్యార్థులు చూపిన చొరవను ఉపాధ్యాయులు అభినందించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు, పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జానయ్య, ఉపాధ్యాయులు . భద్రు, యాదగిరి, మహేష్, . రమ, శ్రీధర్, . రామ్ సింగ్, శోభారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు హక్కు సద్వినియోగం, అంశాల పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం సంతోష కరం.

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో శుక్రవారం ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్విజ్ కాంపిటీషన్ పోటీలకు శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యత ,ఓటు హక్కు సద్వినియోగం,తదితర అంశాల పై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు.ఈ సందర్భంగా ఆయన పోటీలలో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు .ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ పరుశురాం, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు ఉన్నారు

ధారూర్ జాతర భక్తులకు ఘనంగా అన్నదానం.



లోకల్ గైడ్/బంట్వారం : ధారూర్ జాతరకు కాలినడకన వెళ్తున్న భక్తుల ఆకలి తీర్చేందుకు బంట్వారం మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పాత్రికేయులు కే. గోపాల్, శ్రీ మెడికల్ యజమాని బాలరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 400 మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దుర్గం చెరువు మల్లేశం హాజరయ్యారు. జాతరకు కాలినడకన వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో భోజన సౌకర్యం కల్పించడం ద్వారా నిర్వాహకులు సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా కరీంనగర్లో ఘనంగా ఆరోమా స్వీట్స్ అండ్ బేకరీ ప్రారంభోత్సవం

ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ కళాకారులు



కరీంనగర్ నవంబర్ 13 లోకల్ గైడ్ ప్రతినిధి : కరీంనగర్ నగరంలోని కోర్టు ఎదురుగా ఉన్న పెంచాల కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆరోమా స్వీట్స్ అండ్ బేకరీ' ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, నగర ప్రముఖులు నూతన సంస్థ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. నగరానికి చెందిన ప్రముఖులు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని సందడి చేశారు. కాగా, ప్రముఖ టెలివిజన్ కామెడీ షో జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, ఫైమా, శ్రీ విద్య ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిని చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపడంతో ప్రారంభోత్సవ ప్రాంగణంలో సందడి నెలకొంది. అతిథులు బేకరీలోని వివిధ రకాల స్వీట్లు, బేకరీ ఉత్పత్తులను పరిశీలించి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా బేకరీ యాజమాన్య సభ్యులు మాట్లాడుతూ.. వినియోగదారులకు స్వచ్ఛమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంప్రదాయ రుచులతో కూడిన స్వీట్లతో పాటు ఆధునిక తరానికి నచ్చే వివిధ రకాల స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, కేకులు, హాట్ స్నాక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నాణ్యత, రుచితో పాటు సరసమైన ధరలకు ఉత్పత్తులను అందించడం తమ ప్రత్యేకత అని పేర్కొన్నారు. సామాన్యుల నుంచి అన్ని వర్గాల వినియోగదారుల వరకు తమ ఉత్పత్తులను కొనుగోలు చేసేలా ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. కరీంనగర్ నగర ప్రజల ఆదరణతో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బేకరీ యాజమాన్య సభ్యులు గొట్టిముక్కుల రవీందర్, అరుణ్ కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య.



కరీంనగర్ నవంబర్ 13 లొకల్ గైడ్ ప్రతినిధి : శుక్రవారం రోజున భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ అధికారి (డిసిఎల్) కొంటె ప్రసాద్ గారికి లేబర్ కార్యాలయం కలెక్టరేట్ లొ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఆయన డి మాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రధానంగా సంక్షేమ బోర్డులో అవినీతి అక్రమాలను అరికట్టి బోర్డులో సభ్యులుగా కార్మిక నాయకులను చేర్చుకోవాలని, ల్యాబ్స్ అయినా కార్డులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పె ండింగ్లో ఉన్నటువంటి క్లెమ్లను వెంటనే పరిష్కరించి కార్మిక లోకాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ పనులు చేసి 50 సంవత్సరాలు దాటిన కార్మికునికి 5 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని సహజ మరణానికి రెండు నుండి ఐదు లక్షల రూపాయల పెంచాలని ఆయన కోరారు. మెటర్నటీ, మ్యారేజ్ గిఫ్టును లక్ష రూపాయలకు పెంచాలన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దు చేయాలన్నారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుల కుమార్, బత్తుల శ్రీనివాస్ ఐలవేణి రాజ్ కుమార్, రెడ్డి మొండయ్య, నాయకులు వీ రాజు,జి రాజయ్య, ఎం శ్రీనివాస్,ఏ శశి కుమార్,అరవింద్, సాగర్, తిరుపతి,రణధీర్, కే సంపత్ మహేష్,రాజు,రఘు లతోపాటు భవనిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ,అధికారులు సమన్వయంతో పనిచేయాలి

తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి : శుక్రవారం జిల్లా పరిషత్ నూతన భవనంలో అధికారిక వృత్తి కార్యక్రమాలు చేపట్టే వేదుకలో భాగంగా తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సిడిపి(ఎంఎల్ఏ), జిల్లా పరిషత్ కు (ఎస్ఎంజి) సంబంధించిన 72 లక్షల నిధుల వ్యయంతో చేపట్టిన జిల్లా పరిషత్ నూతన కార్యాలయ భవన ప్రహారీ గోడ, అంతర్గత సి.సి.రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ....ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా బాధ్యతాయుతంగా అధికారులు స్పందించాలని ఆయన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల సూచనలు, అధికారుల సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సభాపతిఅధికారులను ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఆయన సూచించారు.నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ లను వారి చాంబర్లలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాలువాలతో సత్కరించి ఆసీనులను గావించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా , జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి వికారాబాద్ ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేషం, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ప్రజల ఆయురారోగ్యాల కోసం
ముత్యాలమ్మను వేడుకున్న చైర్ పర్సన్ జ్యోతి రమేష్



లోకల్ గైడ్, మహబూబాబాద్, నవంబర్ 13 : నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న నాగదేవతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ పవిత్రమైన పర్వదినం సందర్భంగా మహబూబాబాద్ పట్టణ ప్రజలందరికీ నాగుల పంచమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని శ్రీ ముత్యాలమ్మ తల్లిని ప్రార్థించారు. శ్రీ ముత్యాలమ్మ తల్లి, నాగులమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

పేదవారి పక్షపాతిగా ఇందిరమ్మ రాజ్యం...
రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతాం

ఖమ్మం రూరల్ మండలం నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించిన మంత్రి

ఖమ్మం, నవంబర్ - 13: లోకల్ గైడ్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యం పేదవాని పక్షపాతి అని, పేదవారి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం లో క్రొత్త చేయూత పింఛను మంజూరు పత్రాలను లబ్ధిదారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ పేదవాడి పక్షపాతిగా పరిపాలిస్తోందని అన్నారు. ప్రజలకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు. మొన్నటి దీపావళి పండుగ నాడు రాష్ట్రవ్యాప్తంగా 2,21,500 కుటుంబాలు తమ సొంత ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు చేసి పండుగ జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 40 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పింక్ షర్ట్ వేసుకుని వచ్చినా సరే పేదవాడైతే చాలు ఇందిరమ్మ ఇల్లు అందించి తీరుతామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో గడిచిన 33 నెలల్లో డ్వాక్రా మహిళలకు రూ. 73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా తెలంగాణలో పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. గత తొమ్మిదిన్నరేళ్లలో ఇవ్వని కొత్త రేషన్ కార్డులను తమ ప్రభుత్వం అందించిందని తెలిపారు. ఇంకా ఎవరైనా చేయూత పెన్షన్ కు అర్హులు మిగిలి ఉంటే మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కె. శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ ఎంపిడిఓ కె. రవికుమార్, తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, మండలంలోని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా భద్రత




లోకల్ గైడ్, నవంబర్ 13 : ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహబూబాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతుందని స్పష్టం చేశారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. నవంబర్ 14 నుంచి పథకంపై విస్తృత ప్రచారం చేపట్టాలని, నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. నవంబర్ 19న ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల బీమా రక్షణ ఉంటుందని, కుటుంబ పెద్ద సూచించిన వ్యక్తిని నామినీగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ, దరఖాస్తుల సేకరణ, నామినీ వివరాల నమోదు, డిజిటలైజేషన్ పక్కాగా జరగాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. వచ్చే 15 నుంచి 20 రోజుల పాటు యుద్ధప్రాతిపదికన ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్డీఓ మధుసూదన రాజు, సీపీఓ శ్రీనివాసరావు, డీపీఓ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

"నారాయణ పాఠశాలలో ఘనంగా డ్రెస్ కాంపిటీషన్ "



ఖమ్మం : లోకల్ గైడ్ : నారాయణ పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్ కాంపిటీషన్‌ను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ఆకర్షణీయమైన వేషధారణలతో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు . తమ ప్రతిభను , సృజనాత్మకతను చక్కగా ప్రదర్శించారు . ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం , సృజనాత్మకత , వేదికపై మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ యాదవ్ తెలిపారు . విద్యార్థుల ప్రదర్శనలను ఉపాధ్యాయులు అభినందించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు .

అఖిల భారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయండి: ఎండి జహంగీర్



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 13 (లోకల్ గైడ్) : నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే రైతు కిసాన్ మహాసభ బహిరంగ సభకు రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.డి. జహంగీర్ పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టే విధంగా ఉందన్నారు. రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను సమరశీల పోరాటంతో రద్దు చేయించామని గుర్తు చేశారు. ఎస్ఎల్పీసీ, డిండి ఎత్తిపోతల, మూసి ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, ఊష్కాగుల శ్రీనివాస్, ఉస్కాగుల రమేష్, తూర్పు నుండి మల్లేశం, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బొడ్డు రాజు, ఆర్టీవో పాషా, కందగట్ల ఆనంద్, ఎండి రేష్మ, గుణముని అయిలయ్య, కలకుంట శివ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15వతేదీన చెరుకూరి వారి మామిడి తోటలో జరిగే వన
సమారాధనకు తరలిరండి:కుల బాంధవులకు పిలుపునిచ్చిన మున్నూరుకాపు ప్రముఖులు



ఖమ్మం, నవంబర్ 13: లోకల్ గైడ్ బ్యూరో : జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం దక్కకపోవడం తీవ్ర విచారకరమని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ,గౌరవాధ్యక్షులు కొత్త సీతారాములు,గౌరవ సలహాదారులు పార నాగేశ్వరరావు, పొదిల రవికుమార్,మెంతుల శ్రీశైలం, పసుపులేటి నాసరయ్య,ఉపాధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వరరావు, మాటేటి నాగేశ్వరరావు, మడిశెట్టి వెంకటేశ్వరరావు,

పట్టణ అధ్యక్షులు పార ఉదయ్ కుమార్,జీవీఎల్ నరసింహారావు, కోనేటి నారాయణ,గుండపునేని నరసింహారావు,వనం శ్రీనివాసరావులు అన్నారు.అన్ని రంగాలలో అన్యాయానికి గురవుతున్న బీసీలు తమ న్యాయమైన హక్కుల సాధనకు, రాజ్యాధికారంలో సముచిత వాటాను దక్కించుకునేందుకు గాను మరింత సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈనెల 15వతేదీన చెరుకూరి వారి మామిడి తోటలో జరిగే వన సమారాధన నేపథ్యంలో శుక్రవారం మున్నూరుకాపు వసతిగృహంలో నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మున్నూరుకాపుల్లో మరింత చైతన్యాన్ని పాదుగొల్పేందుకు,ఐకమత్యాన్ని,ఆత్మ గౌరవాన్ని పెంపొందించేందుకు పవిత్ర కార్తీక మాసంలో వన సమారాధన జరుపుతున్నామని చెప్పారు.రాజకీయాలు, పార్టీలకు అతీతంగా నిర్వహించే ఈ మహోత్సవానికి ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్,వద్దిరాజు రవిచంద్ర,ఐఏ్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,మాజీ ఎమ్మెల్యేలు దానం నాగేందర్,వనమా వెంకటేశ్వర రావు, బాజిరెడ్డి గోవర్ధన్, దాస్యం వినయ్ భాస్కర్, కోరుకంటి చందర్,పుట్టా మధుకర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత,మున్నూరుకాపు కార్పోరేషన్ ఛైర్మన్ బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, అపెక్స్ కౌన్సిల్ ఛైర్మన్ మీసాల చంద్రయ్య తదితర ప్రముఖులు అతిథులు హాజరవుతారని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి 15వతేదీ ఆదివారం ఉదయం 10 గంటల కల్లా కుల బాంధవులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి మమతా మెడికల్ కాలేజీ గొల్లగూడెం రోడ్డులో చెరుకూరి వారి మామిడి తోటకు చేరుకుని మన ఐకమత్యాన్ని మరోసారి చాటి చెబుదామని వారు పిలుపునిచ్చారు.

కరీంనగర్‌లో టీఎన్జీవోల సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం



కరీంనగర్ నవంబర్ 13 లోకల్ గైడ్ ప్రతినిధి: ఈరోజు స్థానిక టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, హక్కులు భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక అంశాలపై చర్చించడం జరిగింది.డిసెంబర్ 12న భారీ ర్యాలీ: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12న నిర్వహించనున్న భారీ ర్యాలీకి టీఎన్జీవో కేంద్ర సంఘం ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. సీపీఎస్‌పై ప్రభుత్వం వెంటనే కమిటీని ఏర్పాటు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణకు సంబంధించి కమిటీ త్వరగా వేసి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ కమిటీ నివేదికను త్వరగా తెప్పించుకొని, ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు, మెరుగైన చికిత్స అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, (నెట్‌వర్క్ హాస్పిటల్ సర్వీసెస్) పరిధిలో ఉద్యోగులకు అందించే వైద్య సేవల విషయంలో ఏ ఉద్యోగి కూడా ఆసుపత్రుల్లో ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసుపత్రులు ఉద్యోగుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. ఏదైనా సందర్భంలో అదనపు చార్జులు కానీ డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేసినటువంటి ఆస్పత్రుల వివరాలు సంఘానికి తెలుపవలసిందిగా కోరారు. ఇతర ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని సమావేశంలో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాసరెడ్డి కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్ సర్దార్ హర్మీందర్ సింగ్ ప్రభాకర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు నాయకులు ఇరుమల్ల శారద రమేష్ గౌడ్ ప్రసాద్ రెడ్డి సునీత సరిత తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్ చొప్పదండి అధ్యక్షులు సత్యనారాయణ కార్యదర్శి నరేష్ జమ్మికుంట కార్యదర్శి సాయి కుమార్ నాల్గవ తరగతి జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి నాయకులు కమలాకర్ హరిప్రియ సుస్మిత విజయలక్ష్మి కరుణాకర్ సుధాకర్ రెడ్డి, లవకుమార్ అజ్గర్ అలీ, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు..

తెలంగాణ అండర్-19 బాలికల క్రికెట్ జట్టుకు అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్

ఢిల్లీలో చిక్కుకున్న 17 మంది క్రీడాకారిణులకు తక్షణ ప్రయాణ ఏర్పాట్లు

కేంద్ర మంత్రి చొరవతో సురక్షితంగా జమ్మూ కాశ్మీర్ చేరుకున్న జట్టు




కరీంనగర్ నవంబర్ 13 లోకల్ గైడ్ ప్రతినిధి : జాతీయ స్థాయి అండర్-19 బాలికల క్రికెట్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న తెలంగాణ జట్టుకు ఎదురైన ప్రయాణ కష్టాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తక్షణమే పరిష్కరించారు.జమ్మూ కాశ్మీర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు తెలంగాణ నుండి 17 మంది బాలికల క్రికెట్ బృందం బయలుదేరింది. అయితే, ఢిల్లీ నుండి జమ్మూ కాశ్మీర్ వెళ్లే క్రమంలో అనివార్య కారణాల వల్ల ప్రయాణపరమైన ఇబ్బందులు తలెత్తాయి. సమయానికి పోటీలకు చేరుకోలేమోనని క్రీడాకారిణులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కరీంనగర్ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వేముల అనిల్ కుమార్ ద్వారా ఈ విషయం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి వెళ్లింది. సమాచారం అందిన వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి క్రీడాకారిణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రయాణ ఏర్పాట్లు చేయించారు. ఆయన చొరవతో 17 మంది క్రీడాకారిణులు సకాలంలో, సురక్షితంగా జమ్మూ కాశ్మీర్‌కు చేరుకున్నారు. తమ కష్టకాలంలో వెంటనే స్పందించి అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు తెలంగాణ అండర్-19 బాలికల క్రికెట్ జట్టు సభ్యులు, కోచ్‌లు , క్రీడాకారిణుల తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ వేముల అనిల్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా ప్రజాకవి కాళోజీ వర్ధంతి వేడుకలు

కరీంనగర్ నవంబర్ 13 లోకల్ గైడ్ ప్రతినిధి : తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి, పద్మవిభూషన్..కాళోజీ నారాయణరావు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజీ నారాయణ రావు వర్ధంతి వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా జరిగాయి. రేకుర్తిలోని కాళోజీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాళోజీ నారాయణ రావు విగ్రహానికి మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు కార్పొరేటర్లు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాళోజీ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజి నారాయణ రావు అని, నేటితరాలకు ఆదర్శ ప్రియుడని తెలిపారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అని నినాదించిన.. ప్రజాకవి కాళోజి జీవితం అంతా తెలంగాణ భాష సాహితి సేవ దిశగా సాగిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి-కృష్ణగౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం లక్ష్మీ- ప్రకాష్, గాజ రమ-శివరాం, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత...కల్వకుర్తిలో వేలాది కొత్త పింఛన్లు మంజూరు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా కృషి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.




కల్వకుర్తి నవంబర్ 13, (లోకల్ గైడ్): రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదలకు ఆసరాగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన చేయూత పింఛన్లను మంజూరు చేయడంపట్ల కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క కల్వకుర్తి నియోజకవర్గంలోనే వేలాది కొత్త పింఛన్లు మంజూరు కావడం నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఊరటనిచ్చే విషయమని పేర్కొన్నారు. నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఒంటరి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నిధులను జమ చేయనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అర్హత ఉండి కూడా పింఛన్ పొందని వారు ఉంటే, వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పేదల జీవితాల్లో నిజమైన మధుర క్షనాలు.

ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోగురి పురుషోత్తం రెడ్డి



లోకల్ గైడ్ న్యూస్ 13 కొందుర్గ్ : రంగారెడి జిల్లా కొందుర్గ్ మండలోని ఉత్తరాస్పల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వారి గృహ ప్రవేశ కార్యక్రమం చాలా ఆర్భాటంగా జరిగింది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారు లు దొడ్డపల్లి పావని శేఖర్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించటం జరిగింది ఈకార్యక్రమానికి ముక్య అతిథులుగా విచ్చేసినా కాంగ్రెస్ పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షులు కొగురి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నిరుపేదలైన ఇల్లు లేని ప్రతిఒక్కరికి రాజకీయ పార్టీలకు అతీతంగా ఇళ్లు మంజూరి చేస్తుంది కేవలం ప్రజా ప్రభుత్వం అని ఆయన అన్నారు అనంతరం నూతన గృహంలో పూజా కార్యక్రమశీ నిర్వహించి, లబ్ధిదారులను శాలువాతో సత్కరించారు వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గోవర్ధన్ గౌడ్,మాజీ ఎంపీటీసి లు ఎర్రవరం అంజిరెడ్డి,మల్లేష్ గౌడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రామరాజు ,సీనియర్ నాయకులు,పొట్ట శివకుమార్ ,వార్డ్ సభ్యులు కమ్మరి రాజు మల్లేష ,గణేష్ రవి మహిళలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

వికారాబాద్‌లో ‘ ఏవీఎం ఎస్ కేర్ హాస్పిటల్’ గొప్ప ప్రారంభం



లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ వి ఎం ఎస్ కేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుక ఎంతో ఘనంగా జరిగింది. ఈ ఆసుపత్రిని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రుబ్బెన కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... వికారాబాద్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని అన్నారు. అత్యవసర వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన ఇబ్బంది లేకుండా, ఇలాంటి ఆసుపత్రులు ఇక్కడే ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి ఆయన సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, ఆధునిక వైద్య పరికరాలను స్పీకర్ పరిశీలించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఆర్. మహిపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

మై హోమ్ అవతార్ సిగ్నల్ జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



గండిపేట, నవంబర్ 13 (లోకల్ గైడ్): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టస్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు, 5వ మరియు 7వ తరగతులకు చెందిన సుమారు 30 మంది నార్సింగి ట్రాఫిక్ సి ఐ ఆంజనేయులు విద్యార్థులు శుక్రవారం నార్సింగి సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ సిగ్నల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులు, ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం నార్సింగి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుతమైన ఆలోచన పెంపొందించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి రాజేష్ గౌడ్, కానిస్టేబుల్ రహీం, వీరేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

15న మల్ రెడ్డి యువశక్తి మెగా జాబ్ మేళా

ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

మంచాల మండల కాంగ్రెస్ నాయకులు పాలకుర్ల శేఖర్ గౌడ్



ఇబ్రహీంపట్నం,మంచాల నవంబర్13 (లోకల్ గైడ్) : మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచాల మండల కాంగ్రెస్ నాయకులు పాలకుర్ల శేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరానికి చేరువలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పలు ఐటీ కంపెనీలతో పాటు వివిధ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలనే గొప్ప లక్ష్యంతో వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని అన్ని గ్రామాలు,మున్సిపాలిటీలలోని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరూ ఈ మేళాకు హాజరుకావాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆ పై చదువులు చదువుకున్న అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఆదివారం ఉదయం 10 గంటల వరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ వద్దకు చేరుకోవాలని సూచించారు. పలు ప్రముఖ కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలలో పాల్గొని, తమ అర్హతలకు తగిన ఉద్యోగం, ఉపాధి పొంది భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని పాలకుర్ల శేఖర్ గౌడ్ తెలియజేశారు.

మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ల ఎగురవేతపై నిషేధం

భారత్ సమ్మిట్-2026, కేంద్ర రక్షణ మంత్రి పర్యటన నేపథ్యంలో

సైబరాబాద్ పోలీసుల ఉత్తర్వులు



సైబరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): భారత్ సమ్మిట్-2026, ప్రముఖుల పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాల ఎగురవేతపై సైబరాబాద్ పోలీసులు నిషేధం విధించారు. నవంబర్ 14న హెచ్‌ఐసీసీ, హైటెక్స్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్-2026కు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. అలాగే నవంబర్ 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైటెక్స్‌ను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల భద్రత, ప్రముఖుల రక్షణ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధ ఉత్తర్వులు నవంబర్ 13వ తేదీ రాత్రి 7.00 గంటల నుంచి నవంబర్ 15వ తేదీ సాయంత్రం 6.00 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఈ సమయంలో మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి సామర్థ్యం కలిగిన రిమోట్ కంట్రోల్ డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలను ఎగురవేయడానికి అనుమతి ఉండదు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ఈ నోటిఫికేషన్‌ను ప్రజలకు తెలియజేసేందుకు పత్రికల ద్వారా ప్రచురించాలని, పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ముఖ్యమైన వివరాలు: ఉత్తర్వులు జారీ చేసిన అధికారి: డాక్టర్ ఎం. రమేష్, నిషేధిత ప్రాంతం: మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి, ప్రారంభం: 2026 నవంబర్ 13 రాత్రి 7.00 గంటలు, ముగింపు: 2026 నవంబర్ 15 సాయంత్రం 6.00 గంటలు, చట్టపరమైన ఆధారం: బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163.

రబీ సీజన్ ప్రణాళిక, విద్య భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



కామారెడ్డి జిల్లా, (లోకల్ గైడ్) : రాబోయే రబీ సీజన్ ప్రణాళిక, విద్య, భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులు తమకు అందుబాటులో ఉన్న నీటితో సూక్ష్మ సేద్యం పద్ధతులను అవలంబిస్తూ , వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో సూచించిన పంటలు వేసుకోవాలని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాయితీ విత్తనాల పంపిణీ, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, సగటున రాష్ట్రస్థాయిలో విద్యార్థుల హాజరు 73.74 శాతం ఉండగా, జిల్లా స్థాయిలో 72.21 శాతంగా ఉందని, ఉపాధ్యాయుల హాజరు రాష్ట్ర స్థాయిలో 87.06 శాతం, జిల్లా స్థాయిలో 88.05 శాతంగా నమోదు అయిందని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరుకు అనుగుణంగా విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగుపడేందుకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని పెంచాలని, మరిన్ని పాఠశాలలు, విద్యార్థులను వాటిలో భాగస్వాములను చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. సమగ్ర శిక్షా పథకం క్రింద చేపట్టిన సివిల్ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో ప్రవేశాల లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో 11 వేల 520 సీట్లకు గాను 7 వేల 107 ప్రవేశాలు నమోదుతో సుమారు 61.69 శాతం సీట్లు భర్తీ అయ్యాయని, సీట్ల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డిగ్రీ కళాశాలలలో ఎఫ్.ఆర్.ఎస్. విధానంపై దృష్టి సారించాలని తెలిపారు. వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఈ కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిధిలో చేపడుతున్న భూసేకరణ పనుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణకు సంబంధించి అవార్డు జారీ, పరిహారం పంపిణీ, భూముల స్వాధీనం మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించాలని తెలిపారు. అవార్డు జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన భూయజమానులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియను నిర్ణీత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని తెలిపారు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రబీ సాగుకు సంబంధించి రైతులకు తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు రాయితీ విత్తనాల పంపిణీపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను అధికారుల సమన్వయంతో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా, ప్రభుత్వ విద్య సంస్థలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, డిఇఓ మల్లికార్జున్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఇరిగేషన్ డిపిఓ మురళి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్లేట్ పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు

త్రిశూలం అమరం, పేర్లతో రెండు ప్రత్యేక కార్యక్రమాలు

సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు సమాజంలోని సమకాలీన సమస్యలపై విద్యార్థుల చైతన్య సందేశం

సుమారు 1,100 మంది విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన





కొత్తుల్లాపూర్ నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి) : స్లేట్ – ది స్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. రెండు దశల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థుల కోసం ‘త్రిశూలం (త్రిశూలం)’, హైస్కూల్ విద్యార్థుల కోసం ‘అమరం (అమరం)’ పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో సుమారు 1,100 మంది విద్యార్థులు పాల్గొని పాటలు, నృత్యాలు, నాటికలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకున్నారు.ఉదయం నిర్వహించిన ‘త్రిశూలం’ కార్యక్రమంలో ఆధునిక సాంకేతిక ప్రపంచంలో పిల్లల ఎదుగుదల, విద్యా విధానం, తల్లిదండ్రుల బాధ్యతలు, మానవీయ విలువల ప్రాధాన్యతను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా చక్కగా వివరించారు. సాఫ్ట్‌వేర్ విప్లవం నుంచి కృత్రిమ మేధ (ఏఐ) యుగం వరకు చోటుచేసుకున్న మార్పులు, డిజిటల్ పరికరాలపై పెరుగుతున్న ఆధారపడటం, వాటి ప్రభావం పిల్లల బాల్యంపై ఎలా ఉంటుందనే అంశాలను ప్రదర్శించారు. కుటుంబ సంబంధాలు, వినియోగ సంస్కృతి, ఆర్థిక క్రమశిక్షణ వంటి సమకాలీన అంశాలను కూడా స్పృశించారు.విద్య అంటే కేవలం మార్కులు, పరీక్షలు, కంఠస్థం చేయడం మాత్రమే కాదని, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా పిల్లల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, భావోద్వేగ పరిణతి, సామాజిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటూనే మానవీయ విలువలను కాపాడుకోవాలనే సందేశాన్ని అందించింది. మధ్యాహ్నం నిర్వహించిన హైస్కూల్ విద్యార్థుల ‘అమరం’ కార్యక్రమం సమాజంలో నెలకొన్న సమస్యలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబ బంధాలు, సామాజిక బాధ్యతలపై ఆలోచింపజేసింది. పరీక్షలు, ర్యాంకుల పేరుతో పిల్లలపై తల్లిదండ్రులు పెంచుతున్న ఒత్తిడి, సంపద, హోదా కోసం జరుగుతున్న పోటీ, ఓటీటీ, సోషల్ మీడియా ప్రభావం, మొబైల్ ఫోన్ వ్యసనం వంటి అంశాలను విద్యార్థులు నాటకీయ ప్రదర్శనల రూపంలో ఆవిష్కరించారు.అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌ల కారణంగా కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, మానసిక ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అతివేగంగా వాహనాలు నడపడం, తోటివారి ఒత్తిడికి లోనై ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం, ఆధునిక సంబంధాల్లో పరస్పర గౌరవం, భావోద్వేగ పరిపక్వత లోపించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.విజయవంతమైన జీవితానికి విద్య, వృత్తిపరమైన అర్హతలతో పాటు భావోద్వేగ మేధస్సు, సామాజిక స్పృహ, బాధ్యతాయుత ప్రవర్తన కూడా అవసరమని విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా సందేశమిచ్చారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ఆర్థిక అవగాహన, కుటుంబ బంధాల పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో సంయమనం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యతనిచ్చారు.ఈ రెండు కార్యక్రమాల ద్వారా విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానం, పరీక్షల్లో సాధించే మార్కులకే పరిమితం కాకూడదని, విద్యార్థులను జీవితంలోని విభిన్న పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే సంపూర్ణ వ్యక్తులుగా, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే నిజమైన విద్య అనే సందేశాన్ని స్లేట్ పాఠశాల అందించింది.వినోదాన్ని పంచుతూనే సమాజంలోని వాస్తవ పరిస్థితులపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలోచించేలా సాగిన ఈ వార్షికోత్సవ వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠ్యాంశాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, భావోద్వేగ వికాసానికి సమాన ప్రాధాన్యతనిచ్చే స్లేట్ పాఠశాల 360 డిగ్రీల సమగ్ర విద్యా విధానానికి ఈ వేడుకలు ప్రతిబింబంగా నిలిచాయి.

రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో సైబరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

నవంబర్ 14న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాల దారి మళ్లింపు

ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసుల సూచన

సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ ఆంక్షలు



సైబరాబాద్, నవంబర్ 13 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ) : గిగ్ వర్కర్ల బైక్ ర్యాలీ నేపథ్యంలో, ఈ నెల 14వ తేదీన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ పాల్గొననున్న కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. శిల్పకళా వేదిక నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించనున్న ఈ ర్యాలీ సందర్భంగా మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపులు అమలు చేయనున్నారు. నవంబర్ 14వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు సైబర్ టవర్స్ నుంచి హైటెక్స్ కమాన్ (మెటల్ చార్మినార్) మీదుగా హెచ్ఐసీసీ, నోవాటెల్ వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించనున్నారు. “ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే:” సైబర్ టవర్స్ నుంచి కొండాపూర్, కొత్తగూడ వైపు వెళ్లేవారు: సైబర్ టవర్స్ వద్ద యశోద - వసంత సిటీ రోడ్డు మీదుగా నోవాటెల్, ఆర్టీఏ జంక్షన్ చేరుకొని ఎడమవైపు తిరిగి కొండాపూర్ మీదుగా కొత్తగూడకు వెళ్లాలి. సైబర్ టవర్స్ నుంచి బొటానికల్ గార్డెన్ వైపు వెళ్లేవారు: సైబర్ టవర్స్ వద్ద నుంచి ఐకియా రోటరీ వైపు మళ్లి, కుడివైపు తిరిగి మీనాక్షి, రోలింగ్ హిల్స్, రాడిసన్ జంక్షన్ మీదుగా గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకొని బొటానికల్ గార్డెన్‌కు చేరుకోవాలి. కొత్తగూడ నుంచి సైబర్ టవర్స్ వైపు వెళ్లేవారు: కొత్తగూడ జంక్షన్ వద్ద రాడిసన్ వైపు మళ్లి, ఎడమవైపు తిరిగి ఏఐజీ, ఐకియా రోటరీ మీదుగా ఎడమవైపు తిరిగి సైబర్ టవర్స్‌కు చేరుకోవాలి. టెక్ మహీంద్రా నుంచి మెటల్ చార్మినార్ వైపు వెళ్లేవారు:సీఐఐ జంక్షన్ వద్ద నుంచి కొత్తగూడ వైపు మళ్లి, ఎడమవైపు తిరిగి బొటానికల్ గార్డెన్ మార్గంలో వెళ్లాలి. ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో పైన పేర్కొన్న మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించనున్నారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ భారీ వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు.వాహనదారులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ట్రాఫిక్ పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కోరారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పంచాయతీ రోడ్డు, డ్రైనేజీ కబ్జాపై కలకలం..

విలాసాగర్‌లో ఎంపీఓ విచారణ

అనుమతుల్లేకుండా వార్డు సభ్యుడి ఇంటి నిర్మాణం

ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గ్రామానికి చెందిన మహిళ

క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండల పంచాయతీ అధికారి ఉమాదేవి

అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని గ్రామస్తుల డిమాండ్



లోకల్ గైడ్, కాటారం : ప్రజా ఆస్తులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే కబ్జాలకు పాల్పడితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు కాటారం మండలం విలాసాగర్ గ్రామంలో తలెత్తుతున్నాయి. గ్రామంలో ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన పంచాయతీ రోడ్డుతో పాటు ప్రభుత్వ డ్రైనేజీ ఆక్రమణకు గురవుతున్నాయంటూ గ్రామానికి చెందిన సిహెచ్ మధునమ్మ ఇటీవల ప్రజావాణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.విలాసాగర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు అందే సత్యనారాయణ మల్లయ్య, గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండానే సుమారు ఆరు అడుగుల పంచాయతీ రోడ్డును, ప్రభుత్వ డ్రైనేజీని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలకే రక్షణ లేకపోతే ఎలా అని స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.స్థలాన్ని పరిశీలించిన ఎంపీఓప్రజావాణి ఫిర్యాదుపై స్పందించిన మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) ఉమాదేవి శుక్రవారం విలాసాగర్ గ్రామంలో పర్యటించి వివాదాస్పద నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఆక్రమణలు నిర్ధారణ అయితే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా తక్షణమే అక్రమ నిర్మాణాన్ని తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు మధునమ్మతో పాటు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలోని ఒక ప్రధాన సభ్యుడికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



కామారెడ్డి జిల్లా,(లోకల్ గైడ్) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ పథకం లక్ష్యాలు, అర్హతలు, అమలు విధానం తదితర అంశాలను ఆయన వివరించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న బీమా లబ్ధిదారుడు మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా తక్షణ ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సార్వజనీన జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబంలోని ఒక ప్రధాన సభ్యుడిని బీమా లబ్ధిదారుడిగా నమోదు చేస్తారని, బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో వారి నామినీకి రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందజేస్తారని వివరించారు. ఈ పథకాన్ని ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగాప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులను ప్రతి గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉంచి, అర్హులైన కుటుంబాల వివరాలను సేకరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఈ పథకం అమలుకు సంబంధించి అర్హులైన కుటుంబాలను గుర్తించి, అవసరమైన వివరాలను సేకరించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

వాసవి పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవం



లోకల్ గైడ్(13నవంబర్ కామారెడ్డి టౌన్) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని వాసవి పబ్లిక్ స్కూల్లో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన జయంతిని ఘనంగా జరుపుకున్నారు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు బమ్మెర రవీందర్, కరస్పాండెంట్ భక్తుని రామచంద్రన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ మృతి పట్ల నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : నల్లగొండ పట్టణం మాన్యంచెల్కలోని మాజీ కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ గారి పార్థివదేహాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు .మాతంగి సత్యనారాయణ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు .నివాళులర్పించిన వారిలో మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ , పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

కారేపల్లిలో సంక్షేమ జాతర.. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చొరవ!

18,216 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు.. 791 మందికి చేయూత పింఛన్లు, 349 గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ





కారేపల్లి, నవంబర్ 13(లోకల్ గైడ్ న్యూస్) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి (సింగరేణి) మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించి రైతులు, పేదలు, గిరిజన కుటుంబాలకు అండగా నిలుస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించి లబ్ధిదారులకు పథకాల ఫలాలను అందజేశారు. ముందుగా రైతులకు మద్దతుగా సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా, పండించిన పత్తికి గిట్టుబాటు ధర లభించేలా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని 18,216 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, 791 మంది అర్హులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అలాగే ఐటీడీఏ ద్వారా మంజూరైన 349 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను గిరిజన కుటుంబాలకు అందజేసి వారి సొంతింటి కల సాకారం దిశగా ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, రైతులు, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, వైరా నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి.పద్మ, సింగరేణి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ వి.రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, సొసైటీ డైరెక్టర్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈనెల16న ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల16న సాధారణ ప్రజావాణితో పాటు ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాలలకు సంబంధించిన వ్యక్తిగత,సామాజిక సమస్యలు,ఇబ్బందులు,ఇతర ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు.ఈ అవకాశాన్ని జిల్లాలోని బాలబాలికలు,వారి తల్లిదండ్రులు,సంరక్షకులు సద్వినియోగం చేసుకొని,పిల్లలకు సంబంధించిన సమస్యలు,ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తెలియజేయవచ్చని వివరించారు.

వెల్ విత్ స్టోర్ ను ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .లోకల్ గైడ్ : నల్లగొండ పట్టణంలో ఏర్పాటు చేసిన వెల్‌విత్ స్టోర్ ను మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, ఫిట్‌నెస్, వెల్‌నెస్‌కు సంబంధించిన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. నేటి జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్టోర్ నిర్వాహకులు కడియం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును కాపాడాల్సిన అధికారులే చెరువుకు గండి కొట్టారా

దొంతికుంటను కబ్జాల పాలు చేసి రూ.5 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ హడావుడి!

23 ఎకరాల 38 గుంటల చెరువు అస్తిత్వానికే ముప్పు

పంట కాలువలు మాయం-వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు

ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాల్సింది పోయి వాటికి పరోక్షంగా చట్టబద్ధత కల్పిస్తున్నారా?

అధికారుల తీరుపై రైతులు, పట్టణ ప్రజల ఆగ్రహం







లోకల్ గైడ్ : అశ్వారావుపేట : చెరువులను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే చెరువుల పాలిట శాపంగా మారుతోందా? ఆక్రమణలను అరికట్టి జలవనరుల అస్తిత్వాన్ని కాపాడాల్సిన అధికారులే వాటి విధ్వంసానికి పరోక్షంగా సహకరిస్తున్నారా? అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నా, ఆ అభివృద్ధికి పునాది కావాల్సిన చెరువు భూమి, నీటి ప్రవాహ మార్గాలు, పంట కాలువలను కాపాడాలన్న కనీస బాధ్యత ఎందుకు కనిపించడం లేదు? అశ్వారావుపేట పట్టణంలోని దొంతికుంట చెరువును చూస్తే ఇలాంటి ప్రశ్నలు అనేకం తలెత్తుతున్నాయి. సుమారు 23 ఎకరాల 38 గుంటల విస్తీర్ణం కలిగిన దొంతికుంట చెరువు నేడు ఆక్రమణల చెరలో చిక్కుకుని తన అసలు స్వరూపాన్ని కోల్పోయే దుస్థితికి చేరుకుంది. ఒకప్పుడు పట్టణానికి, ఆయకట్టు రైతాంగానికి జీవనాధారంగా నిలిచిన ఈ జలవనరు నేడు అధికారుల నిర్లక్ష్యం, ఆక్రమణల పర్వం, ప్రణాళికలేని అభివృద్ధి పనులతో ఉనికిని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

ఆక్రమణలు అధికారులకు కనిపించవా

2005లో అప్పటి ప్రభుత్వం నీరు-మీరు కార్యక్రమంలో భాగంగా దొంతికుంట చెరువును సుందరీకరించి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అయితే చెరువు అభివృద్ధి పేరుతో మొదలైన కార్యక్రమం కాలక్రమంలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితికి దారితీసిందనే ఆరోపణలు ఉన్నాయి. చెరువు అసలు విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత భూమి మిగిలింది? ఎంత మేర ఆక్రమణకు గురైంది? చెరువులోకి నీరు వచ్చే ఫీడర్ ఛానళ్లు ఎక్కడ ఉన్నాయి? నీరు బయటకు వెళ్లే మోరీలు, పంట కాలువల పరిస్థితి ఏమిటి? అనే ప్రాథమిక అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రజల ముందు వాస్తవాలు ఉంచాల్సిన బాధ్యత అధికారులపై లేదా? కానీ ఆక్రమణల తొలగింపుపై స్పష్టమైన చర్యలు కనిపించకపోగా, చెరువు కట్టను ఆనుకుని వ్యాపార సముదాయాలు, చెరువు పరిధిలోనూ, నీటి ప్రవాహ మార్గాల్లోనూ నిర్మాణాలు వెలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ సంబంధిత శాఖల దృష్టికి వెళ్లినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

రూ.5 కోట్ల అభివృద్ధి, అసలు సమస్యలకు పరిష్కారం ఎక్కడ

దొంతికుంట చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల రూ.5 కోట్ల నిధులతో పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభమైన ఈ అభివృద్ధి కార్యక్రమంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ కోట్లాది రూపాయలతో మినీ ట్యాంక్‌బండ్ నిర్మించే ముందు చెరువు అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించారా? ఆక్రమణలను గుర్తించారా? పట్టణంలోని వర్షపు నీరు చెరువులోకి చేరే మార్గాలను పునరుద్ధరించారా? చెరువులో నిల్వ ఉండే నీటిని కిందనున్న ఆయకట్టు పొలాలకు అందించే కాలువలను పునర్నిర్మించారా?ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. చెరువును సుందరీకరించడం అంటే కేవలం కట్టపై వాకింగ్ ట్రాక్‌లు, ఇతర అలంకరణ పనులు చేపట్టడం మాత్రమే కాదు. చెరువుకు నీరు వచ్చే మార్గాలను కాపాడటం, నీటిని నిల్వ ఉంచడం, అవసరమైనప్పుడు ఆయకట్టుకు అందించడం, వరద నీరు సురక్షితంగా వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయడం అసలైన అభివృద్ధి. ఈ ప్రాథమిక అంశాలను పక్కనపెట్టి కోట్ల రూపాయలతో సుందరీకరణ చేపడితే అది ప్రజాధనానికి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తుంది?

కాలువలు కబ్జా రైతుల సాగునీటికి శాపం!

దొంతికుంట చెరువుకు సంబంధించిన పంట కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణలు రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చెరువు నుంచి ఆయకట్టు పొలాలకు నీరు వెళ్లాల్సిన కాలువలపైనే రియల్ ఎస్టేట్ లేఔట్లు, ఇతర నిర్మాణాలు వెలుస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. కాలువలు లేకుండా పోతే చెరువులో నీరు ఉన్నా రైతులకు ఉపయోగం ఏమిటి? సాగునీరు అందించాల్సిన కాలువలే కనుమరుగైతే ఆయకట్టు వ్యవస్థ ఎలా బతుకుతుంది? కాలువల పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారా? ఇస్తే ఏ నిబంధనల ఆధారంగా ఇచ్చారు? అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే వాటిని ఎందుకు తొలగించడం లేదు? రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు పరస్పరం బాధ్యతలు మార్చుకుంటూ కాలం గడుపుతున్నాయా? రైతుల జీవనాధారమైన సాగునీటి వ్యవస్థను కాపాడటంలో నిర్లక్ష్యం వహించడం క్షమించరాని అంశం.

మురుసు తుఫాను బయటపెట్టిన ఆక్రమణల బాగోతం!

ఇటీవల కురిసిన ముసురు తుఫాను వర్షాలు దొంతికుంట చెరువు వాస్తవ పరిస్థితిని మరోసారి బయటపెట్టాయి. పట్టణంలోని వర్షపు నీరు చెరువులోకి చేరే పరిస్థితి, అక్కడి నుంచి నీరు బయటకు వెళ్లే మార్గాల కొరత కారణంగా గుర్రాల చెరువు రోడ్డు, గౌడ్ బజారు, మంగళ బజారు తదితర ప్రాంతాలు నీట మునిగే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం పట్టణంలో వరద నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా ఉందో తెలియజేస్తోంది. చెరువుకు నీరు వచ్చే మార్గాలు, బయటకు వెళ్లే వరద కాలువలు సక్రమంగా ఉంటే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండేదా? అన్నది ప్రజల ప్రశ్న. తుఫాను వర్షాలతో చెరువు నీటిమట్టం పెరిగిన సమయంలో చెరువు పరిధి, ఆక్రమణలు, నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు స్పష్టంగా బయటపడినా వాటిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు కనిపించకపోవడం ఆందోళనకరం.

చెరువుకు గండి కొట్టడం పరిష్కారమా? బాధ్యత ఎవరిది?

పట్టణంలోని కొన్ని ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయనే కారణంతో దొంతికుంట చెరువుకు భారీ స్థాయిలో గండి కొట్టిన ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చెరువులను కాపాడాల్సిన అధికారులే చెరువుకు గండి కొట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ముందస్తు వరద నిర్వహణ ప్రణాళికలు ఏమయ్యాయి? చెరువులోకి వచ్చే నీటి మార్గాలను, బయటకు వెళ్లే వరద కాలువలను ఆక్రమణల నుంచి విముక్తం చేయాల్సిన బాధ్యత ఎవరిది? ఈ చర్యకు సంబంధించి ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారా? ఇరిగేషన్ శాఖ సాంకేతిక పరిశీలన చేసిందా? చెరువు నీటిని విడుదల చేయడం తప్పనిసరి అయితే అందుకు సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారా? గండి కొట్టడం వల్ల ఆయకట్టు రైతులకు కలిగే నష్టాన్ని అంచనా వేశారా? ఈ ప్రశ్నలన్నింటికీ సంబంధిత అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. తాత్కాలికంగా వరద ముంపును తగ్గించేందుకు తీసుకున్న చర్య అయినప్పటికీ, దాని వల్ల చెరువు నీటి నిల్వ, కట్ట భద్రత, కిందనున్న ఆయకట్టు వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడిందో సాంకేతికంగా పరిశీలించాలి. వరద నియంత్రణ పేరుతో శాశ్వత జలవనరుల పరిరక్షణను బలిచేయడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రజలు రైతులు ప్రశ్నిస్తున్నారు.

మినీ ట్యాంక్‌బండ్ పూర్తయితే ముంపు ముప్పు తొలగుతుందా?

ప్రస్తుత పరిస్థితుల్లో దొంతికుంట చెరువుపై చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కూడా పట్టణానికి వరద ముప్పు తొలగుతుందన్న నమ్మకం ప్రజల్లో కలగడం లేదు. పట్టణంలోని వర్షపు నీరు చెరువులోకి చేరే ఫీడర్ ఛానళ్లు ఆక్రమణలకు గురైతే, చెరువులోకి నీరు ఎలా వస్తుంది? చెరువులోకి వచ్చిన నీటిని సురక్షితంగా బయటకు పంపే వరద కాలువలు లేకపోతే పట్టణానికి ముంపు ముప్పు ఎలా తప్పుతుంది? మరోవైపు ఆయకట్టు కాలువలు పునరుద్ధరించకపోతే రైతులకు సాగునీరు ఎలా అందుతుంది?ఇవన్నీ పరిష్కరించకుండా కేవలం మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తిచేయడం వల్ల ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరుతుందా? లేక కోట్లాది రూపాయలతో ఒక అందమైన నిర్మాణం చేసి, దాని చుట్టూ ఉన్న అసలు సమస్యలను అలాగే వదిలేస్తారా?

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి చట్టబద్ధత కల్పిస్తున్నారా?

ప్రజల ఆవేదనలో అత్యంత కీలకమైన అంశం ఇదే. చెరువు భూములు, పంట కాలువలు, వరద నీటి ప్రవాహ మార్గాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం వాటి ఆక్రమణలపై మౌనం వహిస్తే అది ఎవరి ప్రయోజనాల కోసం? ఆక్రమణలను తొలగించకుండా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ఇప్పటికే జరిగిన ఆక్రమణలకు పరోక్షంగా చట్టబద్ధత కల్పించినట్లవుతుందన్న విమర్శలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకోకూడదు. చెరువు విస్తీర్ణంపై స్పష్టమైన సర్వే లేకుండా, హద్దులు నిర్ధారించకుండా, నీటి ప్రవాహ మార్గాలను గుర్తించకుండా అభివృద్ధి పనులు చేపట్టడం భవిష్యత్తులో మరిన్ని వివాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. చెరువు కబ్జాకు గురైతే నీటి భద్రత దెబ్బతింటుంది. కాలువలు కబ్జాకు గురైతే రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. వరద మార్గాలు మూసుకుపోతే పట్టణ ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకే ముప్పు ఏర్పడుతుంది.

ఇప్పటికైనా కళ్లు తెరవాలి.. దొంతికుంటను కాపాడాలి!

ప్రకృతి విపత్తుల ముందు మానవ నిర్మాణాలు, అధికార యంత్రాంగం తీసుకునే తాత్కాలిక చర్యలు ఎంత బలహీనమైనవో ఇటీవలి వర్షాలు మరోసారి నిరూపించాయి. భవిష్యత్తులో అశ్వారావుపేట పట్టణం వరద ముప్పును ఎదుర్కోకుండా ఉండాలంటే ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, దొంతికుంట చెరువు 23 ఎకరాల 38 గుంటల అసలు విస్తీర్ణాన్ని అధికారిక రికార్డులతో సరిపోల్చి రీ-సర్వే నిర్వహించాలని, ఆక్రమణలకు గురైన చెరువు భూములను గుర్తించి చట్ట ప్రకారం తొలగించాలని, చెరువుకు నీరు వచ్చే ఫీడర్ ఛానళ్లు, బయటకు వెళ్లే వరద కాలువలు, ఆయకట్టు పంట కాలువలను పునరుద్ధరించాలని, చెరువుకు గండి కొట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, రూ.5 కోట్లతో చేపడుతున్న మినీ ట్యాంక్‌బండ్ పనులను కేవలం సుందరీకరణకే పరిమితం చేయకుండా చెరువు పరిరక్షణ, వరద నియంత్రణ, సాగునీటి సరఫరా అనే మూడు ప్రధాన లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలని అశ్వారావుపేట ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు ఉంటేనే నీరు, నీరు ఉంటేనే రైతు, రైతు ఉంటేనే పట్టణానికి జీవం!

దొంతికుంట చెరువును కాపాడలేని అభివృద్ధి ఎవరికి ఉపయోగం? చెరువుకు గండి కొట్టి సాధించే అభివృద్ధి ఎవరి కోసం? ప్రజాధనంతో నిర్మించే మినీ ట్యాంక్‌బండ్ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే సుందర ప్రదేశంగా నిలుస్తుందా? లేక భవిష్యత్తులో మరో వరద విపత్తుకు వేదికగా మారుతుందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిందేనని ప్రజలు కోరుతున్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

కదిలిన విద్యార్థి లోకం నిరసనలో పాల్గొన్న 5000 ల మంది విద్యార్థులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం



లోకల్ గైడ్ (13నవంబర్ కామారెడ్డి టౌన్) : కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టిఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయాలను పూర్తిగా విడుదల చేయాలని కోరుతూ 5000 ల మంది విద్యార్థులతో నిరసన,భారీ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే,టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కోర్సులు పూర్తి చేసుకున్నప్పటికీ వారి సర్టిఫికెట్స్ కళాశాలలోనే ఉండిపోవడంతో ఉన్నత విద్యకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఓబీసీ విద్యార్థులు దూరమవుతున్నారని వెంటనే పెండింగ్ ఫీజు బకాయాలను విడుదల చేయాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది,రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కార్యాచరనను రూపొందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యులు పర్లపల్లి రవీందర్,డాక్టర్ నీల బాలు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కు సంబంధించిన ఫీజు బకాయలను విడుదల చేయకుండా,ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన వాటినే విడుదల చేసి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తుందని,కమిషన్లు తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజుబకాయలు ఇవ్వడం జరిగిందని,పక్కనే ఉన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కళాశాలలకు ఫీజుబకాయలు విడుదల కావడం జరిగితే కామారెడ్డికి ఎందుకు విడుదల చేయలేదు అని ప్రశ్నించారు.33 జిల్లాలలో కొన్ని జిల్లాలలోని కళాశాలలకు విడుదల చేసి,మరికొన్ని జిల్లాల కళాశాలలకు ఫీజు బకాయలు విడుదల చేయకపోవడంలో గల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.గతంలో ఫీజుబకాయలు చెల్లించాలని పోరాట బాట పట్టిన రేవంత్ రెడ్డి మరి ప్రస్తుతం విద్యార్థుల ఫీజు బకాయలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు బకాయాలను విడుదల చేయకపోతే వేలాదిమంది విద్యార్థులతో ప్రజా భవన్ ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చౌట గణేష్, సవిందర్ నాయక్,మోతే రాజిరెడ్డి,కొత్త వినయ్ యూసుఫ్,మన్నన్,రవి కుమార్,అంజల్ రెడ్డి లు పాల్గొనడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు.

మహిళా ప్రొఫెసర్ ను లైంగికంగా వేధించిన యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి

- బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారద న్ మహారాజ్.

బాధితురాలికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లను పోలీస్టేషన్ లో పెట్టడం అన్యాయం- డాక్టర్ విశారద మహా రాజన్.





రాజేంద్రనగర్ (లోకల్ గైడ్) : కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పూర్తిగా రక్షణ లేకుండా పోతుందని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆరోపించారు. నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, యువతులు చివరికి బాలికలు సైతం లైంగిక వేదింపులకు గురవుతున్నా, ఈ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అయితే విశ్వవిద్యాలయంలో కూడా మహిళా ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు గురికావడం విడ్డూరంగా ఉందన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహించే మహిళా ప్రొఫెసర్ ను విశ్వవిద్యాలయం ఉపకులపతి లైంగికంగా వేధించడం సరైంది కాదని, ఇది క్షమించరాని నేరమన్నారు. లైంగిక వేధింపుల ను ఖండించి బాధితురాలికి మద్దతుగా ధర్నా చేస్తున్న ప్రొఫెసర్లను పోలీసులచే కఠినంగా అరెస్టు చేయించడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ నేడు నేరం చేసిన వాళ్ళు, తప్పు చేసినోళ్లకే వంతు పాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక మహిళా ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు గురై న్యాయం కావాలంటూ పోరాడుతుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నాడు. పోలీసు వ్యవస్థ కూడా సరైన విధంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. బాధితురాలికి మద్దతుగా ధర్నా చేస్తున్న ప్రొఫెసర్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించడంలోని ఎవరి హస్తం ఉందో చెప్పాలని ప్రశ్నించారు. కాసా ప్రధాన కార్యదర్శి చల్లా సౌజన్య కు 9 నెలల పసిపాప ఉందని చూడకుండా మానవత్వం మరిచి పోలీసులు వ్యవహరించిన తీరు ఏమాత్రం సమంజసం కాదన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళా ప్రొఫెసర్ కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రాము యాదవ్, రాజ్ కమల్ మహారాజ్, కార్యదర్శి బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499